## విలేకరులు కావలెను

TV6 NATINAL NEWS CHANNEL
కదిలించే వార్త తెలుగు దినపత్రికకు
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ,మండలాల విలేకరులు కావలెను.తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికీ, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికీ ప్రాధాన్యత ఇవ్వబడును.

వివరములకు ఈ క్రింది ఫోన్ నెంబర్ ని సంప్రదించండి:

**99592 92159**



KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

సంపుటి : 06 సంచిక : 171 పేజీలు : 08, వెల రూ. 5రూ/ శుక్రవారం - 12 - డిసెంబర్ - 2025

Ananthapuramu. Vijayawada. Tirupati. Visakhapatnam. tadepalligudem. Guntur. Kurnool. Nellore. Srikakulam. Rajamahendravaram. Kadapa. Ongole. Chittoor. Hyderabad. mahabubnagar.


## తిరుమలకు ఔటర్ రింగ్‌రోడ్డు - సర్వే ప్రారంభించిన తుడా



ఓఆర్ఆర్ ప్రతిపాదనలు

తెరపైకి తెచ్చిన తుడా

కొత్త మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణానికి సర్వే

అమరావతి : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి దేశం నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలి వస్తుంటారు. ఈ సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. తిరుమల క్షేత్రానికి నిత్యం 70 వేల నుంచి లక్ష మందికి పైగా భక్తులు వస్తుంటారు. మిగతా..2లో

## ఆ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ గడువు పొడిగించిన ఎన్నికల సంఘం



తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో గడువు పొడిగింపు

అండమాన్ నికోబర్ కేంద్రపాలిత ప్రాంతంలోనూ పొడిగింపు

గడువు పొడిగించాలని కోరిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం

ఢిల్లి : కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) గురువారం ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఓటర్ల జాబితా ప్రత్యేక మిగతా..2లో

## ఆయన 'భారతరత్న'కు నిజంగా అర్హుడు



2 లో

- తమిళ కవి సుబ్రహ్మణ్య భారతికి భారతరత్న ఇవ్వాలని కోరిన పవన్ కళ్యాణ్
- భారతి జయంతి సందర్భంగా సోషల్ మీడియా వేదికగా నివాళి
- ఆయన జీవితం నుంచి మూడు ముఖ్యమైన పాఠాలు నేర్చుకున్నానన్న పవన్

అమరావతి : ప్రముఖ తమిళ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు సుబ్రహ్మణ్య భారతికి భారతరత్న పురస్కారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

## అమరావతిలో కీలక కార్యాలయాలు
## 44 అంశాలకు మంత్రివర్గం ఆమోదం

- దాదాపు 44 అజెండా అంశాలతో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- అమరావతిలో లోక్‌భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ కార్యాలయం, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి అంగీకారం



2లో

అమరావతి : సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన మంత్రివర్గ సమావేశంలో 44 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. అజెండా అంశాలు ఎక్కువగా ఉన్నందున ఉదయం కొంచెం ముందుగానే సమావేశం ప్రారంభమయ్యింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణకు సంబంధించి దాదాపు 9,500 కోట్ల రూపాయలతో 506 ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలో లోక్‌భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ కార్యాలయం, 2 గెస్ట్ హౌస్‌లు, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి అంగీకారం లభించింది. సీడ్ యాక్సిస్ రహదారిని 16వ జాతీయ రహదారికి అనుసంధించే ఇంటర్‌చేంజ్, వంతెనలు, అండర్‌పాస్‌ల పనులకు రూ.532 కోట్ల మేర టెండర్లు పిలిచేందుకు క్యాబినేట్ ఆమోదముద్ర వేసింది. ఎల్1 బిడ్ ఆమోదానికి సీఆర్‌డీఏ కమిషన్‌కు ప్రతిపాదనకు ఆమోదం లభించింది. కుప్పంలో పాలేరు నదిపై చెక్ డ్యాంల నిర్వహణకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

## డ్రోన్ల తయారీ రంగంలో సహకరించండి

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ని కోరిన మంత్రి లోకేశ్
- అమెరికాలో అడోబ్, ఇంటెల్,ఎన్‌విడియా, జూమ్ సంస్థల ప్రతినిధులతోనూ భేటీలు
- 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ యాక్సిలరేటర్' ద్వారా స్టార్టప్‌లకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపిన సుందర్ పిచాయ్



2లో

ఢిల్లి : అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలు గూగుల్, ఇంటెల్, అడోబ్, ఎన్‌విడియా, జూమ్ సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రం సాంకేతికంగా అభివృద్ధి చెందుతోందని, సెమీకండక్టర్ల తయారీ, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ యూనిట్ల ఏర్పాటుకు ఎకోసిస్టమ్ గురించి వారికి వివరించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డ్రోన్ సిటీ ప్రాజెక్టులో డ్రోన్ అసెంబ్లింగ్, టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని గూగుల్ సంస్థకు మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు. ఈ మేరకు ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్‌తో సమావేశం అయ్యారు. గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, గూగుల్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలీ ఈ భేటీలో పాల్గొన్నారు. విశాఖలో ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టు పనులు

## హైదరాబాద్‌లో రూ. 300 కోట్లతో భారీ టన్నెల్ అక్వేరియం



2 లో

- కొత్వాల్‌గూడలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రాజెక్టు
- దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ అక్వేరియంగా గుర్తింపు
- వచ్చే ఏడాది నాటికి సందర్శకులకు అందుబాటులోకి
- 300 రకాల జీవులతో పాటు అండర్ వాటర్ రెస్టారెంట్ ఏర్పాటు

## నా సవాల్‌ను అమిత్ షా స్వీకరించలేదు- ఆయన అప్పుడు ఒత్తిడిలో ఉన్నారు'

- అమిత్ షాపై విమర్శలు గుప్పించిన రాహుల్
- సవాల్‌ను హోం మంత్రి స్వీకరించలేదని ఎద్దేవా



2

ఢిల్లి : ఓటు చోరీ అంశంపై ఇచ్చిన మూడు ప్రెస్ కాన్ఫరెన్స్?లపై పార్లమెంట్?లో చర్చించాలని అమిత్ షాకు తాను నేరుగా సవాల్ విసిరానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. అయినా అమిత్ షా నుంచి దానిపై ఎటువంటి సమాధానం రాలేదన్నారు. ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా అమిత్ షా ఒత్తిడిలో ఉన్నట్లు కనిపించారని విమర్శించారు. "నిన్న అమిత్ షా చాలా ఆందోళనగా ఉన్నారు. ఆయన తప్పుడు భాష ఉపయోగించారు. ఆయన చేతులు వణికాయి. అమిత్ షా తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్నారు.

## ఏపీకి ఎక్కువగా పెట్టుబడులు
## చంద్రబాబు పరిపాలనపై మంచి ఫీడ్ బ్యాక్

- ఏపీ, తెలంగాణ బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ అల్పాహార విందు
- సీఎం చంద్రబాబుతో పూర్తి సమన్వయంతో వెళ్తున్నామని వెల్లడి



2లో

అమరావతి : ఏపీలో సీఎం చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని చెప్పారు. గురువారం ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాల బీజేపీ ఎంపీలకు ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. 15 మంది ఎంపీలతో సుమారు అరగంటపాటు మాట్లాడారు. పెట్టుబడులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్నాయని, ఇది చాలా మంచి అభివృద్ధి అని మోదీ కితాబిచ్చారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, ఆ పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు బీజేపీ కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని మోదీ దిశానిర్దేశం చేశారు. ఈ అల్పాహార విందులో ఎంపీ పురందేశ్వరి, సీఎం. రమేష్, భూపతిరాజు శ్రీనివాస వర్మ

## 80ఏళ్ల ఏజ్‌లో లక్ష్మి అదుర్స్ అథ్లెట్ క్వీన్‌కు పతకాలే పతకాలు



2 లో

- కాలికి గాయమైనా ఆసియా క్రీడల్లో విజయం!
- విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచాలనే ఉద్దేశ్యంతో మహిళ
- భర్తతో కలిసి కూడా పతకాలు సాధించిన లక్ష్మి

## మెస్సీ ఫుట్ బాల్ మ్యాచ్‌కు రాహుల్, ప్రియాంక గాంధీని ఆహ్వానించా

## హైదరాబాద్‌లో మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్

- కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించిన సీఎం
- రాష్ట్ర ప్రభుత్వానికి మెస్సీ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదన్న రేవంత్ రెడ్డి
- లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్? గాంధీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న రేవంత్ రెడ్డి, చిత్రంలో ప్రియాంక గాంధీ



2లో

హైదరాబాద్ : హైదరాబాద్?లో జరగబోయే మెస్సీ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో సీఎం మీడియాతో పలు విషయాలపై మాట్లాడారు.

## ప్రతి ఆరోపణకు డాక్యుమెంట్లతో సమాధానం ఇస్తా



2 లో

- ఎమ్మెల్యే కృష్ణారావు విమర్శలపై కవిత ఘాటు స్పందన
- వ్యక్తిగత విమర్శలు ఆయన ఫ్రస్ట్రేషన్‌కు నిదర్శనమని వ్యాఖ్య
- కృష్ణారావు అవినీతిని బయటపెడతానని హెచ్చరిక

మొదటి పేజి తరువాయి

## అమరావతిలో కీలక కార్యాలయాలు

## - 44 అంశాలకు మంత్రివర్గం ఆమోదం

ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ ముసాయిదా బిల్లుపై క్యాబినేట్‌లో చర్చించారు. ఎస్ఐపీబీలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో 26 సంస్థల ఏర్పాటుకు సంబంధించి రూ.20,444 కోట్ల పెట్టుబడులకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. వీటి ద్వారా 56 వేల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగనుంది. ఈ-3 రోడ్ విస్తరణ ఎల్1 బిడ్‌కు ఏడీసీఎల్‌కు అధికారం ఇచ్చేందుకు ఆమోదం తెలిపంది. స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు: గిరిజన సంక్షేమ శాఖలో 417 భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతిపై మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 227 తెలుగు పండిట్స్, 91 హిందీ పండిట్స్, పీఈటీస్‌గా 99 మంది మొత్తం 417 మంది గిరిజన శాఖలో స్కూల్ అసిస్టెంట్స్?గా పదోన్నతులు లభించాయి. ఈ మేర కీలక నిర్ణయం తీసుకున్నందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రేపల్లెలో గ్రామీణ రహదారులు నిర్మాణానికి చొరవ చూపినందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్?కు ఫ్లవర్ బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఏపీకి ఎక్కువగా పెట్టుబడులు

## - చంద్రబాబు పరిపాలనపై మంచి ఫీడ్ బ్యాక్

పాల్గొన్నారు. తెలంగాణ ఎంపీలపై ఆగ్రహం: తెలంగాణలో బీజేపీ ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదని ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి టీమ్‌ని పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్య ఏంటని, రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నారని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ పరిణామాలపై తెలుగు ఎంపీలు యాక్టివ్‌గా ఉండాలని, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని మోదీ సూచించారు. ఆ పలాలను నేడు చూస్తున్నాం: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ చేసిన సంస్కరణలు, అభివృద్ధి పలాలను నేడు చూస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చెప్పారు. శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతి వేడుకలను మంత్రి సత్య కుమార్ యాదవ్, పీవీఎన్ మాధవ్?లు ప్రారంభించారు. అటల్ నుంచి మోదీ వరకు అభివృద్ధిపై నేటి తరానికి తెలియజెప్పేందుకు ధర్మవరం నుంచి అమరావతి వరకు బస్సు యాత్ర ప్రారంభించారు. రాష్ట్రంలో అభివృద్ధిని అప్పటి ప్రధాని వాజ్‌పేయీ ప్రారంభించారని ఇంకా రహదారులు మొదలు అనేక సంస్కరణలు వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నప్పుడే జరిగాయని మంత్రి సత్య కుమార్ చెప్పారు. సమర్థవంతమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నాయకుడిగా దేశాన్ని అన్ని విధాలా శక్తివంతం చేసిన గొప్ప వ్యక్తి అటల్ బిహారీ వాజ్‌పేయీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తెలిపారు.

## ఆ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ గడువు

## పొడిగించిన ఎన్నికల సంఘం

సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును వారం రోజుల పాటు పొడిగించింది. ఈ పొడిగింపు తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, అండమాన్ అండ్ నికోబార్ దీవులకు వర్తిస్తుంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో ఎస్ఐఆర్ గడువు డిసెంబర్ 14 (ఆదివారం)తో ముగియాల్సి ఉండగా, దీనిని డిసెంబర్ 19 (శుక్రవారం) వరకు పొడిగించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబర్‌లలో డిసెంబర్ 18 నుంచి డిసెంబర్ 23 వరకు, ఉత్తర ప్రదేశ్‌లో డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 31 వరకు గడువును పొడిగించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యవస్థీకృత పద్ధతిలో పూర్తి చేయడానికి, కచ్చితమైన, నవీకరించబడిన ఓటర్ల జాబితాను నిర్ధారించడానికి మరో రెండు వారాల సమయం ఇవ్వాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా వెల్లడించారు. మరణించిన, బదిలీ చేయబడిన, గైర్హాజరైన ఓటర్లకు సంబంధించిన వివరాలను ధృవీకరించడానికి వీలుగా గడువును పొడిగించినట్లు ఆయన తెలిపారు.

## ఆయన 'భారతరత్న'కు నిజంగా అర్హుడు

గురువారం సుబ్రహ్మణ్య భారతి జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ఓ పోస్ట్ పెట్టారు. సుబ్రహ్మణ్య భారతి భారతరత్నకు అన్ని విధాలా అర్హుడని పవన్ పేర్కొన్నారు. చెన్నైలో పెరిగిన తాను, సుబ్రహ్మణ్య భారతి జీవితం నుంచి మూడు ముఖ్యమైన పాఠాలు నేర్చుకున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. "1) మాతృభూమి పట్ల నిర్భయమైన నిబద్ధత, 2) మాతృభాషపై ప్రేమ, 3) బహుభాషా నైపుణ్యాలు, ఇతర భాషల పట్ల గౌరవం.. ఈ మూడు విషయాలు ఆయన నుంచి నేర్చుకోవాలి. ఆయన నిజంగా భారతరత్నకు అర్హుడు" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మరోవైపు, హరీశ్ శంకర్ డైరెక్షన్ లో పవన్ కల్యాణ్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'దేఖ్లేంగే సాలా' అనే ఫస్ట్ సింగిల్‌కు సంబంధించిన ప్రోమో ఇప్పటికే అంచనాలను పెంచేసింది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ పాటను విశాల్ దద్లానీ ఆలపించారు. భాస్కరభట్ల సాహిత్యం అందించగా, దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. పూర్తి పాటను డిసెంబర్ 13న విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా రాజకీయాలతో బిజీగా ఉన్నప్పటికీ, పవన్ కల్యాణ్ ఈ సినిమా షూటింగ్ కోసం సమయం కేటాయించడం పట్ల గతంలో చిత్రబృందం ప్రశంసలు కురిపించింది.

## మెస్సీ ఫుట్ బాల్ మ్యాచ్‌కు

## రాహుల్, ప్రియాంక గాంధీని ఆహ్వానించా

ఈ నెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ దిగ్గజ క్రీడాకారుడు లియోనల్? మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్నారని, ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. నన్ను కూడా అతిథిగానే పిలిచారు : తనను కూడా ఒక అతిథిగా మెస్సీ ఫుట్?బాల్? మ్యాచ్?కు పిలిచారని రేవంత్? రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి మెస్సీ ఫుట్?బాల్? మ్యాచ్?కు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. ప్రపంచంలోనే ప్రముఖ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్?కు వస్తున్నందున ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో కలిసిన పలువురు నాయకులను ఈ కార్యక్రమానికి రావాలని పిలిచినట్లు చెప్పారు. ఏఐసీసీ అగ్రనేతలను సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సందర్భంలో ఈనెల 8, 9వ తేదీల్లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ద్వారా వచ్చిన పెట్టుబడులు గురించి చర్చించినట్లు సమాచారం. ఇవే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సరళి, అనుసరిస్తున్న ప్రణాళికల గురించి మాట్లాడినట్లు సమాచారం. ఇంటర్నేషనల్? స్టార్లు రాబోతున్నారు : ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ, సీఎం రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. మెస్సీ పర్యటన, ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై చర్యలు చేపట్టారు. మెస్సీ టూర్ వివరాలు : ఈనెల 13వ తేదీ శనివారం రోజున సాయంత్రం 4 గంటలకు లియోనల్? మెస్సీ శంషాబాద్ ఎయిర్?పోర్ట్?కు చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మ్యాచ్‌కు హాజరవుతారు.

## హైదరాబాద్‌లో రూ. 300

## కోట్లతో భారీ టన్నెల్ అక్వేరియం

హైదరాబాద్: హైదరాబాద్ నగరానికి మరో భారీ ప్రాజెక్టు రాబోతోంది. నగర శివారులోని కొత్వాల్‌గూడలో రూ. 300 కోట్ల వ్యయంతో ప్రపంచస్థాయి టన్నెల్ అక్వేరియం నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు, పూర్తయితే దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ అక్వేరియంగా నిలవనుంది. మల్టీవర్స్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్, పాలిన్ అక్వేరియమ్స్, కాడోల్ గ్రూప్ కన్సార్టియం కలిసి ఈ అక్వేరియంను నిర్మించనున్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమి, ఇతర అనుమతులను తెలంగాణ ప్రభుత్వం సమకూర్చనుంది. టెక్నికల్ భాగస్వామిగా పాలిన్ అక్వేరియమ్స్ వ్యవహరించనుండగా, మల్టీవర్స్ హోటల్స్, కాడోల్ గ్రూప్ సంస్థలు ఆతిథ్య, మౌలిక వసతుల విభాగాలను పర్యవేక్షించనున్నాయి. సుమారు 1,75,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో హైదరాబాద్ సంప్రదాయం ఉట్టిపడేలా దీనిని నిర్మించనున్నట్టు పాలిన్ అక్వేరియమ్స్ తెలిపింది. ఇందులో 100 మీటర్ల పొడవైన టన్నెల్‌తో పాటు 30 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో ట్యాంకులు ఉంటాయి. ఒకేసారి 3 వేల మంది సందర్శించేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఈ అక్వేరియంలో 300 జాతులకు చెందిన సుమారు 10 వేల జలచరాలను ప్రదర్శనకు ఉంచుతారు. దీంతో పాటు అండర్ వాటర్ రెస్టారెంట్ వంటి ప్రత్యేక ఆకర్షణలు కూడా ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఏడాది నాటికి ఈ టన్నెల్ అక్వేరియం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

## ప్రతి ఆరోపణకు డాక్యుమెంట్లతో సమాధానం ఇస్తా

హైదరాబాద్ : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనపై చేసిన విమర్శలకు త్వరలోనే ఆధారాలతో సమాధానమిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. రెండు రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి, ఆయన చేసిన ప్రతి ఆరోపణకు డాక్యుమెంట్లతో సమాధానం ఇస్తానని ఆమె ప్రకటించారు. కృష్ణారావు తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ తనలోని ఫ్రస్ట్రేషన్‌ను బయటపెట్టుకున్నారని ఆమె వ్యాఖ్యానించారు. 'జాగృతి జనం బాట'లో భాగంగా నిన్న కంటోన్మెంట్ నియోజకవర్గంలో పర్యటించిన కవిత ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తాను కూకట్‌పల్లిలో 15 ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలనే ప్రస్తావించానని, దానికి కృష్ణారావు వ్యక్తిగత విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. ఆయన అవినీతి పనులను త్వరలోనే బయటపెడతానని హెచ్చరించారు. ఆయన మాటలకు తానేమీ బాధపడటం లేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం యూసుఫ్‌గూడలోనూ పర్యటించిన కవిత, "కృష్ణారావు మానసిక ఒత్తిడిలో ఉన్నారు. ఆడాల్సిన టెస్టులు ఇంకా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు.

# తిరుమలకు ఔటర్ రింగ్‌రోడ్డు - సర్వే ప్రారంభించిన తుడా

మొదటి పేజి తరువాయి

ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం తిరుమలను ప్రపంచంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతోంది. సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన విజన్? 2047కు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు ప్రతిపాదనలు రూపొందిస్తోంది. తాజాగా తిరుపతికి ఔటర్? రింగ్ రోడ్డు ఏర్పాటు ప్రతిపాదనలు రూపొందిస్తోంది. దీంతో నగరంలో ట్రాఫిక్ కష్టాలు గట్టెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ట్రాఫిక్? సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఇప్పటికే అవసరమైన చోట్ల రింగ్?రోడ్డుకు ఏర్పాటుకు ప్రణాళికలు రూపకల్పన చేస్తోంది. ఈ మేరకు అధికారులు సైతం నివేదికలు సిద్ధం చేస్తున్నారు. తాజాగా తిరుపతి నగరంలోనూ ఓఆర్?ఆర్? నిర్మించేందుకు ముందడుగు వేస్తోంది. తిరుమల-తిరుపతిలో ట్రాఫిక్ రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. భక్తులుకు ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ సమస్యలు అన్నింటికి చెక్? పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తిరుపతికి ఓఆర్?ఆర్? ఏర్పాటుకు తుడా ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. ప్రతిపాదనలు తెరపైకి తెచ్చిన తుడా: తాజాగా



ఆధ్యాత్మిక నగరం తిరుపతి భవిష్యత్తు అవసరాలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఆధ్వర్యంలో ఔటర్‌రింగ్ రోడ్డు ప్రతిపాదనలు తెరపైకి తెచ్చింది. తుడా ఛైర్మన్ సి. దివాకర్‌రెడ్డి అధికారులతో కలిసి రింగ్ రోడ్డు రూపకల్పనకు బుధవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఆ మండలాలను కలుపుతూ: తిరుపతి ఔటర్? రింగ్ రోడ్డు తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రామచంద్రాపురం, రేణిగుంట, వడమాలపేట మండలాలను కలుపుతూ నిర్మాణం చేయనున్నారు. కొత్త మాస్టర్? ప్లాన్? రోడ్డు పేరుతో (ఔటర్ రింగ్ రోడ్డు) నిర్మాణానికి సర్వే ప్రారంభించారు. గతంలో సీఎం చంద్రబాబు వైకుంఠమాల పేరుతో చేపట్టదలచిన ఓఆర్?ఆర్? ప్రతిపాదనలకు తిరిగి కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఎక్కువగా వినియోగిస్తూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడంపై తుడా అధికారులు దృష్టి సారించారు. 90 కి.మీ. పరిధిలో: ఈ రింగ్? రోడ్డు నిర్మాణం పూర్తి అయితే గనక తిరుమలకు వచ్చే వాహనాలు నేరుగా ఔటర్ రింగ్? రోడ్డు ద్వారా బయటకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇది అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్? రద్దీ గణనీయంగా తగ్గుతుంది. మొత్తం 90 కిలోమీటర్ల పరిధిలో ఓఆర్?ఆర్? రూపొందించనున్నారు. వడమాలపేట సమీపం నుంచి అప్పలాయగుంట, అనుప్పల్లి, రామచంద్రాపురం, పనపాకం, ఐతేపల్లి, నారావారిపల్లి, కల్యాణి డ్యామ్, జూపార్క్, అలిపిరి, కరకంబాడి రోడ్డు మీదుగా మల్లవరం, పాదిరేడు తదితర ప్రాంతాలు మీదుగా ఓఆర్?ఆర్? రానుంది. దీనికి సంబంధించి పూర్తిస్థాయి వివరణ రావాల్సి ఉంది.

# నా సవాల్‌ను అమిత్ షా స్వీకరించలేదు- ఆయన అప్పుడు ఒత్తిడిలో ఉన్నారు'

మొదటి పేజి తరువాయి

ఇది నిన్న అందరూ చూశారు. నేను ఆయన్ని అడిగిన ప్రశ్నలకు నేరుగా సమాధానం ఇవ్వలేదు. ఎలాంటి రుజువు ఇవ్వలేదు. పార్లమెంట్?లో నా ప్రెస్ కాన్ఫరెన్స్?లన్నింటీ గురించి చర్చించడానికి నేరుగా క్షేత్రస్థాయికి రావాలని నేను అమిత్ షాకు సవాలు విసిరాను. నాకు ఎలాంటి సమాధానం రాలేదు. అందరికీ వాస్తవమేంటో తెలుసు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

'అమిత్ షా స్పీచ్?లో పారదర్శకత లేదు'

మరో కాంగ్రెస్ ఎంపీ తనుజ్ పునియా సైతం రాహుల్ తరహాలోనే వ్యాఖ్యానించారు. అమిత్ షా స్పీచ్ లో పారదర్శకత కనిపించలేదన్నారు. హరియాణాలో ఏం జరిగిందనే అసలు ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, వాటికి బదులుగా కాంగ్రెస్ పై అమిత్ షా ఆరోపణలు చేశారని మండిపడ్డారు.

'షా ప్రసంగంతో డైలమాలో నెహ్రూ ఫ్యామిలీ'

అలాగే అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత గిరిరాజ్ సింగ్ తిప్పికొట్టారు. రాహుల్ గాంధీ కొట్టి పారిపోయే సూత్రాన్ని అవలంబిస్తారని మండిపడ్డారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా మాట్లాడినప్పుడు రాహుల్ సభ నుంచి బయటకు వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. ఇదేనా రాహుల్ ప్రజాస్వామ్యమని ఆరోపించారు. "సత్యాన్ని వినే ధైర్యం ఆయనకు లేదు. నిన్న అమిత్ షా చెప్పిన సత్యాలు రాహుల్ ను నొప్పించాయి. రాహుల్ గాంధీ ఈ అలవాటును వదులుకోవాలి. షా ప్రసంగం ద్వారా నెహ్రూ కుటుంబం మొత్తం గందరగోళంలో పడింది" అని గిరిరాజ్ సింగ్ విమర్శించారు.

### మోదీపై కాంగ్రెస్ ఫైర్

మరోవైపు, వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్లమెంట్?లో చర్చ నిర్వహించిన తర్వాత ప్రధాని మోదీ, ఆయన బృందం చెప్పిన అబద్ధాలు పూర్తిగా బహిర్గతమయ్యాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. లోక్ సభ, రాజ్యసభలో మూడు రోజుల పాటు వందేమాతరంపై చర్చ జరిగిందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని ఇద్దరు అత్యుత్తమ చరిత్రకారులు రాసిన జాతీయ గీతం, గేయంపై రెండు కచ్చితమైన, అధికారిక పుస్తకాలను ప్రధాని మోదీ, ఆయన సహచరులు చదవలేదని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ క్రమంలో రుద్రంగ్షు ముఖర్జీ రాసిన సాంగ్ ఆఫ్ ఇండియా: ఎ స్టడీ ఆఫ్ ది నేషనల్ యాంథమ్, సవ్యసాచి భట్టాచార్య రాసిన వందేమాతరం కవర్ పేజీల స్క్రీన్ షాట్ ను ఈ మేరకు జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. వందేమాతరంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై లోక్ సభలో మండిపడ్డారు. సామాజిక సామరస్యత పేరుతో వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ పార్టీ ముక్కచెక్కలు చేసిందని మండిపడ్డారు. వందేమాతరం గేయం ముస్లింలకు ఆగ్రహం కలిగిస్తుందనే వాదనతో ఆనాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఏకీభవించారని, ముస్లిం లీగ్ నేత మహమ్మద్ అలీ జిన్నాకు వంతపాడి ద్రోహం చేశారని ఆరోపించారు. అయితే ఆ ఆరోపణలను కాంగ్రెస్ బుధవారం ఖండించింది. వందేమాతరంపై చర్చ లక్ష్యం జవహర్ లాల్ నెహ్రూ,



రవీంద్రనాథ్ ఠాగూర్ తో సహా స్వాతంత్ర్య సమరయోధులను అవమానించడమేనని హస్తం పార్టీ ఆరోపించింది. ఈ క్రమంలో ఇదే అంశంపై జైరాం రమేశ్ బీజేపీ, నరేంద్ర మోదీపై ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

రాజ్?నాథ్ ను కలిసిన జైరాం రమేశ్- ఎందుకంటే?

పార్లమెంట్ ఆవరణలో గురువారం ఆసక్తికర పరిణామం జరిగింది. కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ గురువారం రక్షణ మంత్రి రాజ్?నాథ్ సింగ్?కు వల్లభాయ్ పటేల్ కుమార్తె డైరీ ఎంట్రీల కాపీని అందించారు. జవహర్ లాల్ నెహ్రూ ప్రజల నిధులను ఉపయోగించి బాబ్రీ మసీదును నిర్మించాలనుకుంటున్నారని రాజ్?నాథ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో రమేశ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంట్ మకర్ ద్వార్ వెలుపల కారు దిగిన వెంటనే రాజ్?నాథ్?ను జైరాం రమేశ్ కలిసి మణిబెన్ పటేల్ డైరీ ఎంట్రీలను అందించారు.

# డ్రోన్ల తయారీ రంగంలో సహకరించండి

మొదటి పేజి తరువాయి



ప్రారంభించడం పై వారితో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విస్ట్రాన్ న్యూ వెబ్ కార్పొరేషన్ ద్వారా డేటా సెంటర్ సర్వర్ తయారీ ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహించాలని కోరారు. విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు గూగుల్ సంస్థ అంగీకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌లో క్లౌడ్ రీజియన్‌ల విస్తరణతో పాటు 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ యాక్సిలరేటర్' ద్వారా స్టార్టప్‌లకు మద్దతు ఇస్తున్నట్లు సుందర్ పిచాయ్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఇంటెల్ ఏటీఎంపీ యూనిట్ ఏర్పాటు: రాష్ట్రంలో ఉత్పత్తుల అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఇంటెల్‌ను మంత్రి లోకేశ్ కోరారు. ఇంటెల్-అమరావతి ఏఐ రీసెర్చ్ సెంటర్‌ను శ్రీసిటీ ట్రిపుల్‌ఐటీ లేదా ఐఐటీ తిరుపతి భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ప్రతిపాదించారు. ఆ సంస్థ ఐటీ విభాగం సీటీవో శేష కృష్ణపురతో సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఏపీ ప్రభుత్వంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు. ఇంటెల్ ఆధారిత హెచ్‌పీసీ క్లస్టర్లు ఏర్పాటు చేసి విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, ప్రభుత్వం చేపట్టే ఆరోగ్య, వ్యవసాయ, వాతావరణ నమూనా పరిశోధనలకు సహకరించాలి అన్నారు. భవిష్యత్తు నైపుణ్య వర్క్‌ఫోర్స్ తయారు చేసేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ పాఠ్య ప్రణాళికల్లో ఇంటెల్ ట్రైనింగ్ కార్యక్రమాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. ఏపీలోని యూనివర్సిటీల్లో ఇంటెల్ స్కిల్ ల్యాబ్స్‌లను ఏర్పాటు చేయాలిని లోకేశ్ సూచించారు. వీఎల్ఎస్ఐ డిజైన్, సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ మూలాలు, ఏఐ, రోబోటిక్స్‌లో ప్రత్యేక శిక్షణ అందించాలి అని లోకేశ్ ప్రతిపాదించారు.

### గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌కు

### కానుక అందజేస్తున్న మంత్రి లోకేశ్

అడోబ్ జీసీసీ ఏర్పాటు: విశాఖలో అడోబ్ గ్లోబల్ కేపబులిటి సెంటర్ లేదా డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను పరిశీలించాలని అడోబ్ సంస్థను మంత్రి లోకేశ్ కోరారు. ఆ సంస్థ సీఈవో శంతను నారాయణ్‌తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'అమెరికా టెక్ సంస్థలు ఇంటెల్, ఏఎండీ, అప్లైడ్ మెటీరియల్స్ వంటి సంస్థలను అనుసంధానించి ఫ్యాబ్‌లెస్ డిజైన్, పరిశోధన, తయారీ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలిని కోరారు. మీరు డైరెక్టర్‌గా ఉన్న ఫైజర్ సంస్థ ద్వారా టీకాలు, చిన్న మాలిక్యూల్స్, బయోలాజిక్స్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించమన్నారు. మీరు డైరెక్టర్‌గా ఉన్న మరో సంస్థ కేకేఆర్ ద్వారా ఏపీలో పెట్టుబడులు పెట్టేలా సహకరించండి" అని వారికి విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనల పై చర్చించి నిర్ణయం తీసుకుంటామని నారాయణ్ పేర్కొన్నారు.

### అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో చర్చలు

వర్చువల్ తరగతుల నిర్వహణలో సహకరించాలి: అమరావతి లేదా విశాఖలో పరిశోధన, అభివృద్ధి లేదా ఇంజినీరింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని జూమ్ సంస్థ ప్రతినిధులను లోకేశ్ కోరారు. ఆ సంస్థ వీడియో కమ్యూనికేషన్స్ ప్రొడక్ట్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రెసిడెంట్ వెల్చామి శంకరలింగం, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణతో లోకేశ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతంలో ఉన్న నిపుణుల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు వర్చువల్ తరగతుల నిర్వహణలో సహకరించాలని లేకేశ్ కోరారు. రాష్ట్రంలో జూమ్ వేదిక ద్వారా టెలిమెడిసిన్, ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసేందుకు సాంకేతిక సహకారాన్ని అందించాలి అని లోకేశ్ కోరారు. వాటిని పరిశీలిస్తామని శంకరలింగం చెప్పారు. జూమ్ సంస్థ వీడియో కమ్యూనికేషన్స్ ప్రొడక్ట్, ఇంజినీరింగ్ విభాగ ప్రెసిడెంట్ వెల్చామి శంకరలింగం, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణ బృందంతో మంత్రి లోకేశ్ బృందం ఏఐ నైపుణ్యాభివృద్ధిలో సహకరించండి: ఏపీలో ఏఐ నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, భవిష్యత్ సాంకేతికతల బలోపేతానికి సహకరించాలని గేమింగ్, చిప్ డిజైనింగ్, జీపీయూ తయారీలో అగ్రగామి సంస్థ ఎన్‌విడియాను మంత్రి లోకేశ్? కోరారు. ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్, ఎంటర్‌ప్రైజ్ అండ్ క్లౌడ్ సేల్స్ రాజ్ మిర్‌పురితో లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పౌర సేవల్లో ఏఐ వినియోగానికి శిక్షణ, ఏఐ పాఠ్యాంశాల రూపకల్పనలో సూచనలు అందించండి. విద్యార్థులు, పరిశోధకులకు క్వాంటమ్ సిమ్యులేటర్లు అందించేందుకు ఏపీలోని విశ్వవిద్యాలయాలు లేదా పరిశోధన సంస్థలతో పైలట్ ప్రాజెక్టు ఏర్పాటు చేయండి. డిజిటల్ ట్విన్, ఏఐ ఆధారిత పరిశ్రమల ఆప్టిమైజేషన్ కోసం ఎన్‌విడియా ఓమ్నివర్స్, ఐజాక్ సిమ్ వినియోగించేలా స్మార్ట్ ఫ్యాక్టరీ పైలట్ ప్రాజెక్టు ప్రారంభించండి. భారత్‌లో డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం ఎన్‌విడియా కేటాయించిన 850 మిలియన్ డాలర్లను ఏపీలోని డీప్‌టెక్ స్టార్టప్‌లు, మెంటారింగ్ కోసం కేటాయించండి" అని ఆయన ప్రతిపాదించారు. వాటి పై సంస్థ ఉన్నత స్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాజ్ మిర్‌పురి తెలిపారు.

# 80ఏళ్ల ఏజ్‌లో లక్ష్మి అదుర్స్- అథ్లెట్ క్వీన్‌కు పతాకాలే పతకాలు

ఢిల్లి : ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధించొచ్చని మరోసారి నిరూపించారు తమిళనాడుకు చెందిన లక్ష్మి. 80 సంవత్సరాల వయసులో కూడా ప్రతిభకు ఏదీ అడ్డంకి కాదని చాటారు. ఒకానొక సమయంలో కాలికి గాయమైనా, పట్టుదలను వదలకుండా, భర్తతోపాటు కుటుంబ సభ్యుల సపోర్ట్?తో ముందుకు సాగి ఆసియా క్రీడల్లో పతకాలు సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. అసలు ఆమె ఎవరు?

### 90 ఏళ్ల వయసులో కూడా!

లోగనాథన్, లక్ష్మి కోయంబత్తూర్? ప్రాంతానికి చెందిన దంపతులు. లోగనాథన్ ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎడ్యుకేషన్? డైరెక్టర్‌గా పదవీ విరమణ పొందారు. లక్ష్మి ప్రభుత్వ బాలికల ఉన్నత మాధ్యమిక పాఠశాలలో ఫిజికల్? ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా పదవీ విరమణ పొందారు. లోగనాథన్ 9వ తరగతి చదువుతున్నప్పుడు రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని రజత ట్రోఫీని గెలుచుకున్నారు. అప్పుడు ఆయనలో కలిగిన స్ఫూర్తి 90 ఏళ్ల వయసులో కూడా కొనసాగుతోంది. పదవీ విరమణ తర్వాత ఆయన జిల్లా, రాష్ట్ర, జాతీయ, ఆసియా సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని వందలాది పతకాలు, అనేక ట్రోఫీలను గెలుచుకున్నారు. అలాగే ఆయన భార్య లక్ష్మి కూడా పదవీ విరమణ చేసినప్పుడు, సీనియర్ క్రీడా పోటీల్లో పాల్గొనమని ఆమెకు సలహా ఇచ్చి శిక్షణ ఇచ్చారు. క్రీడలపై ఆసక్తి ఉన్న లక్ష్మి, భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని వివిధ దేశాలలో జరిగే అంతర్జాతీయ సీనియర్ క్రీడా పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. క్రీడలపై ఆసక్తితో క్రీడలపై ఆసక్తితో పదవీ విరమణ వరకూ ఫిజికల్? ఎడ్యుకేషన్? టీచర్?గానే చేశానని లక్ష్మి తెలిపారు. "నాకు పెళ్లయి మొదటి బిడ్డ పుట్టినప్పుడు, నా భర్త నన్ను ఉన్నత విద్యను అభ్యసించడానికి ఎంతగానో ప్రోత్సహించారు. ఆ తర్వాత, నేను నా డిగ్రీతో పాటు పరిశోధన అధ్యయనాలతో సహా వివిధ కళాశాలల్లో 8 డిగ్రీలు పూర్తి చేశాను. నా చదువు పూర్తి చేసిన తర్వాత, క్రీడలపై ఆసక్తితో నేను ఒక ప్రభుత్వ పాఠశాలలో చేరి పదవీ విరమణ వరకు శారీరక విద్యా ఉపాధ్యాయురాలిగా పనిచేశాను. అప్పటి నుంచి ఇంట్లో ఊరికే కూర్చోకుండా ఏదైనా సాధించాలనే తాపత్రయం, నా



భర్త ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు గెలుచుకున్నాను. ఫిన్లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ క్రీడా పోటీలో పాల్గొని మూడో స్థానంలో నిలవడం ఒక మరచిపోలేని అనుభవం. 2011లో ఝూర?ండ్‌లో జరిగిన ఒక క్రీడా పోటీలో నా కాలికి గాయమైంది. ఆ సమయంలో నేను నడవలేకపోయాను. వైద్యులు ఇకపై క్రీడా పోటీలలో పాల్గొనవద్దని చెప్పారు. అప్పటికి కూడా నేను నిరాశ చెందలేదు. మరుసటి ఏడాదే ఆసియా క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించాను" అని లక్ష్మి తెలిపారు.

### భర్త, కుటుంబ సభ్యుల మద్ధతుతో

"రోజూ యోగా, వ్యాయామాలు చేయడం వల్ల ఇప్పటి వరకూ పోటీల్లో పాల్గొని పతకాలు గెలుచుకోగలుగుతున్నాను. మమ్మల్ని చూసి ప్రస్తుత విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో మేము ఇలా చేస్తున్నాము. నా భర్త, కుటుంబ సభ్యులు అందించిన సపోర్ట్? వల్లే నేను దీనిని సాధించగలిగాను. మేము పాల్గొనే అంతర్జాతీయ పోటీలను చూడటానికి మా పిల్లలే కాకుండా మా మనవలు కూడా వస్తుంటారు. మా భర్త పాల్గొన్న క్రీడా పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఇప్పుడు ఆ పతకాలను బంగారు గాజులుగా మార్చి నా చేతికి ధరిస్తున్నాను" అని లక్ష్మి తెలిపారు.

### పతకాలతో లోగనాథన్, లక్ష్మి

వయస్సు సహకరించకపోవడంతో క్రీడల్లో పాల్గొనడం మానేశానని లక్ష్మి భర్త లోగనాథన్ చెప్పారు. "పదవీ విరమణ చేసిన తర్వాత నేను అనేక పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. అదేవిధంగా, నేను రెండుసార్లు ఆసియా క్రీడల్లో పాల్గొని పతకాలు గెలుచుకున్నాను. ఇప్పుడు నాకు 90 ఏళ్లు కావడంతో, గత కొన్ని నెలలుగా క్రీడా పోటీల్లో పాల్గొనడం మానేశాను. అయితే, నా భార్య 80 ఏళ్ల వయసులో కూడా వివిధ దేశాలకు ప్రయాణిస్తూ క్రీడా పోటీల్లో పతకాలు సాధిస్తోంది. ఆమె పాల్గొన్న అన్ని పోటీల్లో ఆమె గెలుపుని చూడటం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఒకేసారి ఇద్దరం బంగారు,వెండి పతకాలు గెలిచాం. అది ఒక మరచిపోలేని అనుభవం" అని లోగనాథన్ అన్నారు.

# జోరుగా వైసీపీ సంస్థాగత కమిటీలు



పులివెందుల **కదిలించే వార్త డిసెంబర్ 11 :** వైసీపీ సంస్థాగత కమిటీల నియామకాలు వేగవంతమయ్యాయని పులివెందుల పురపాలక ఇంచార్జి వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. వాటిలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి మరియు పార్లమెంట్ సభ్యుల వైయస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ వార్డ్ కమిటీ ల బలోపేతం దిశగా పులివెందుల మునిసిపాలిటీ పరిధిలో ఉన్న పలు వార్డులలో గురువారం మునిసిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, చైర్మన్ వరప్రసాద్ పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, కౌన్సిలర్ లక్ష్మీ భార్గవి లక్ష్మీ ,ప్రసన్న, వార్డ్ ప్రజల అధ్యక్షతన సీనియర్ నాయకుల తో కలిసి వార్డ్ కమిటీ ల నియామక ప్రక్రియ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వార్డులకు సంబంధించిన బూత్, వార్డు, అనుబంధ కమిటీల నియామక ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. వార్డు అధ్యక్షులతో సమావేశాలు నిర్వహిస్తూ, కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఇస్తూ నివేదికలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గంగిరెడ్డి, చంద్రమౌళి, శ్రీరామ్ సుబ్బయ్య వైసిపి మహిళలు వైసిపి నాయకులు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల స్వేచ్ఛ భద్రతల పై అవగాహన కల్పించిన ఎస్సై జగదీశ్వర్ రెడ్డి,



లింగాల **కదిలించే వార్త డిసెంబర్ 11 :** ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ సూచనలతో" రూరల్ సీఐ ఎన్ వి రమణ" పర్యవేక్షణ, లో వెలిదండ్ల, గ్రామంలోని ప్రభుత్వ పరిషత్ పాఠశాలలో, గురువారం, విద్యార్థులకు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన లింగాల "ఎస్సై జగదీశ్వర్ రెడ్డి' సైబర్ నేరాలు, ఇటీవలగా మహిళల పట్ల జరుగుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్న పరిణామాలపై అవగాహన కల్పించారు. ఇతరుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా వాట్సాప్ ఇన్స్టాగ్రామ్" లో పూర్తి అవగాహనతో కలిగి ఉండాలని, అపరిచితులతో చాటింగ్ చేయడం వారిని ఫాలో కావడం మంచిది కాదని సూచించారు. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు గాని ఇంట్లో తల్లిదండ్రులకు, కానీ తెలియజేయాలని ఏదైనా సమస్య ఉన్నప్పుడు ధైర్యంగా, ఎదుర్కోవాలని పూర్తిగా విద్యార్థి దశలో మంచి అలవాట్లను ఏర్పరచుకొని ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులై, తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని అన్నారు. ఎవరైనా ఏదైనా ఇబ్బంది కలిగిస్తే వెంటనే దగ్గరలో ఉన్న 'పోలీస్ స్టేషన్' లో ఫిర్యాదు చేయాలన్నారు. ఇవాళ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మహిళలే, అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో మంచి ఉన్నత పదవులు రాణిస్తున్నారని గుర్తు చేశారు. క్రీడారంగంలో ప్రపంచం గర్వించదగ్గ క్రికెట్ రంగంలో రాణించి ప్రపంచ కప్ సాధించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. మహిళా ప్రపంచకప్ మన రాష్ట్రానికి, మన జిల్లాకు, చెందిన'శ్రీ చరణి" తనదైన శైలిలో కీలక పాత్ర పోషించి ప్రతిభ కనబరిచి ప్రపంచ కప్ గెలుచుకోవడంలో వెన్నెముకగా నిలిచిన విషయం అందరికీ తెలిసిందే అని ప్రతి ఒక్క మహిళ విద్యార్థిని ఆత్మస్థైర్యంతో, ధైర్యంగా ముందుకు వెళ్లాలి విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధి తిరుమలకు పాదయాత్ర



లింగాల **కదిలించే వార్త డిసెంబర్ 11 :** లింగాల మండలం లింగాల గ్రామం నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధి అయినటువంటి తిరుమలకు పాదయాత్రగా భక్తులు బయలుదేరడం జరిగింది. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు పాదయాత్ర ప్రారంభించడం జరిగింది. ఈ పాదయాత్రలో లింగాల గ్రామ భక్తులతో పాటు కర్ణపాపయ్యపల్లి ,గుణకణపల్లి ,పెద్ద కుడాల తదితర గ్రామాల నుంచి సుమారు 30 మంది దాకా బయలుదేరడం జరిగింది. ఈ పాదయాత్రకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా దిగ్విజయంగా పాదయాత్ర పూర్తి కావాలని భక్తులు కోరుకుంటూ బయలుదేరారు వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని వేడుకుంటూ పాదయాత్ర ప్రారంభించడం జరిగిందని పాదయాత్ర ఆర్గనైజర్ అలవలపాటి శివరామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు

# ముగిసిన భాగవత సప్తహం పఠనం





పులివెందుల **కదిలించే వార్త డిసెంబర్ 11 :** పులివెందుల రింగ్ రోడ్డు అలవలపాడు రోడ్డు సమీపాన కొలువై ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో గురువారం భాగవత సప్తహం పఠనం వై భావంగా ముగిసింది. పై కార్యక్రమాలు భూమి రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి ఆయన తండ్రి సోమేశ్వర రెడ్డి సోదరుడు చంద్ర రెడ్డు ల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. భాగవత పఠనం ఏడు రోజులపాటు దాతల సహకారంతో అల్పాహారం అన్నదానం తదిరంవిజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యం లో జరిగాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం చివరి రోజు ప్రముఖుల ప్రవచనములు నిర్వహించారు. అనంతరం మహిళల చేతుల మీదుగా మంత్రపుష్పం జపిస్తూ ఆలయ ప్రాంగణంలో కలశ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భాగవతా పండితులకు ఘనంగా సత్కరించారు. ఈకార్య క్రమ లో అధ్యక్షులు గంగిరెడ్డి అధ్యక్షులు మాదూరు శేషయ్య రమణారెడ్డి కదిరి శ్రీ.లక్ష్మీ నరసింహా స్వామి భాగవతం అధ్యక్షులు మహేశ్వరి దంతాల పల్లి భాగవతం అధ్యక్షులు కర్ణ రామకంచిరెడ్డి మీడియా యాగంటి బాలకృష్ణారెడ్డి గీతా మందిరం భాగవత పండి తులు.పట్ట గిత్త పల్లి ఆంధ్ర శ్రీనివాసుల నాయుడుతది తరులు పాల్గొన్నారు.

# పులివెందుల అర్బన్ ఎస్ఐగా తిమోతి బాధ్యతల స్వీకరణ

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా




పులివెందుల**కదిలించే వార్త డిసెంబర్ 11 :** పులివెందుల అర్బన్ ఎస్ఐ తిమోతి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కలసపాడు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించగా బదిలీలో కారణంగా పులివెందుల ఎస్సైగా బదిలీ కావడం జరిగిందని తెలియజేస్తూ, వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులోఉంటూ ప్రజా సమస్యల పరిష్కరిస్తానని, అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామ న్నారు. జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. పులివెందుల అర్బన్ స్టేషన్లో పనిచేసిన ఎస్ఐ విష్ణు నారాయణ ట్రాఫిక్ పోలీసుస్టేష నకు బదిలీపై వెళ్ళారని తెలిపారు.

# కూటమిపాలనలో రెడ్బుక్ రాజ్యాంగం నడుస్తోంది

## వైకాపా కార్యకర్తను కొట్టిన టిడిపి కార్యకర్త

## ఎంపీకి విన్నవించుకున్న బాధ్యుడు రఫీ





పులివెందుల **కదిలించే వార్త డిసెంబర్ 11 :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద రంగాపురం గ్రామానికి చెందిన రఫీని మూడు రోజుల కిందట టిడిపి కార్యకర్త దాడి చేశారు. ఈ సందర్భంగా గురువారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని రఫీ వైకాపా నాయకులు కలిసి విషయాన్ని ఆయనకు తెలియజేశారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన ఎంపి వైయస్ అవినాష్ రెడ్డి తొందర పడొద్దు మనకు మంచి రోజులు వస్తాయి జగనన్న చెప్పిన మాట ప్రకారం మనం నడుచుకుందామన్నారు. కర్మ ఫలాలు ఎవరిని వదిలిపెట్టమన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ లక్ష్మణ్ రెడ్డి,పక్రుదిన్ తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# ఏపీలో వైద్య విద్యా రంగాన్ని కాపాడాలి

## పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి డిమాండ్



తిరుపతి **కదిలించే వార్త డిసెంబర్ 11 :** ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విద్యా రంగంలో నెలకొన్న ప్రస్తుత సంక్షోభంపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు సమావేశాలలో బాగంగా మంగళవారం అత్యంత ముఖ్యమైన ప్రజా సమస్యలు ప్రస్తావించే అధికరణ 377 కింద రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశాన్ని ప్రస్తావించారు. ప్రజల ధనంతో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విద్యను విస్తరించాలనే సదుద్దేశంతో 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేయడం జరిగింది. వీటిలో ఇప్పటికే 7 కాలేజీల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరికొన్ని చివరి దశలో ఉన్నాయని ఎంపీ గుర్తు చేశారు. అయితే, నిర్మాణాలు పూర్తయి సిద్ధంగా ఉన్న కాలేజీలకు కూడా అనుమతులు ఇవ్వడంలో జరుగుతున్న అనవసర జాప్యం అత్యంత దురదృష్టకరమని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జాప్యం కారణంగా, ఈ విద్యాసంవత్సరంలో సుమారు 1000కి పైగా ఎంబీబీఎస్ సీట్లను కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతోమంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుండటంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని డాక్టర్ గురుమూర్తి తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాలు కేవలం లాభాపేక్షతో పనిచేస్తాయని, అదే జరిగితే పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా వెనుకబడిన జిల్లాల్లో ప్రజలకు వైద్య సేవలు దూరమవుతాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని డాక్టర్ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు. సిద్ధంగా ఉన్న ప్రభుత్వ కాలేజీలకు వెంటనే అనుమతులు మంజూరు చేసి, ఏపీలో ప్రభుత్వ వైద్య విద్యా రంగాన్ని రక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# రోజుకు 20 వేల మంది స్థానికులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలి

## 16న జరిగే టీటీడీ పాలకమండలి సమావేశంలో సానుకూల నిర్ణయం వెల్లడించాలి

## లేకుంటే 17న టిటిడి పరిపాలన భవనం వద్ద ఆందోళన చేపడతాం

## కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు



తిరుపతి **కదిలించే వార్త డిసెంబర్ 11 :** తిరుమల శ్రీవారి పాదాల చెంత ఉన్న స్థానిక ప్రజలకు వైకుంఠ ద్వార దర్శనంలో రోజుకు 20వేల మందికి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతి పరిధిలో ఉన్నవారు ఇక్కడ నివసించడం అదృష్టంగా భావిస్తారని వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠ ద్వార దర్శనం చేయాలని పరితపిస్తారని చెప్పారు. ఈ సమయంలోనే గోవింద మాలను కూడా ధరించి నియమనిష్టలతో స్వామివారి దర్శనానికి తరలివస్తారని అన్నారు. అయితే టీటీడీ గోవింద మాల ధారణ భక్తులకు ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు దర్శనాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైకుంఠ ద్వార దర్శనానికి దేశం నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చినా స్థానికంగా ఉన్నవారికి ఎక్కువ అవకాశం కల్పించే దిశగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీటీడీకి సూచించారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజున ఆన్ లైన్ లో 23 లక్షల మంది నమోదు చేసుకున్నారని అందులో 80 వేల మంది స్థానికులు ఉంటే టీటీడీ నిర్వహించిన డిప్ ద్వారా ఎంపిక చేసిన 2 లక్షల 19 వేలమందిలో స్థానికులకు వంద మందికి కూడా వైకుంఠ ద్వార దర్శనభాగ్యం దక్కినట్లు లేదనితెలిపారు. వైకుంఠ ఏకాదశి ని భక్తి శ్రద్ధలతో జరుపుకునే స్థానిక ప్రజలకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాల్సిన బాధ్యత టీటీడీ పై ఉందని తెలియజేసారు. స్థానికులకు రోజుకు కనీసం 20 వేలమందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించేలా టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తమకు వైకుంఠ ద్వార దర్శన భాగ్యం కలుగుతుందో లేదో అనే ఆందోళనలలో స్థానిక ప్రజలు ఉన్నారని తెలిపారు. టీటీడీ పాలకమండలిలో స్థానికుడు, శ్రీవారి భక్తుడు అయిన భానుప్రకాష్ రెడ్డి గారు, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి గారు, అలాగే స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గారు, ఎంపీ పనబాక లక్ష్మీ గారు ఉన్నా స్థానిక ప్రజలు, భక్తుల ఆవేదనను అర్థం చేసుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఈవిషయంపై టీటీడీ చైర్మన్, ఈఓలతో చర్చించాలని, ఈనెల 16న జరిగే టీటీడీ పాలకడలి సమావేశంలో దీనిపై ప్రత్యేకంగా చర్చించి సానుకూల నిర్ణయం తీసుకునేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో శ్రీవారి భక్తులతో కలసి 17వ తేదీన టిటిడి పరిపాలన భవనం వద్ద ఆందోళన చేపడతామని ఆయన స్పష్టం చేసారు.

# టిటిడి డైరీలు, క్యాలెండర్లకు భక్తుల నుండి విశేష స్పందన

## ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు

## డిడి తీసి పంపినా పొందవచ్చు

తిరుపతి **కదిలించే వార్త డిసెంబర్ 11 :** టీటీడీ ముద్రించిన 2026 సంవత్సర క్యాలెండర్లు, డైరీలకు దేశ విదేశాలలోని శ్రీవారి భక్తుల నుండి విశేష స్పందన వస్తోంది. శ్రీవారి భక్తుల సౌకర్యార్థం టీటీడీ 2026 సంవత్సరం 12 పేజీల క్యాలెండర్లు %-% 13 లక్షలు, 6 పేజీల క్యాలెండర్లు %-% 75 వేలు, పెద్ద డైరీలు %-% 8.50 లక్షలు, చిన్నడైరీలు %-% 3 లక్షలు, టేబుల్ టాప్ క్యాలెండర్లు 1.50 లక్షలు, శ్రీవారి పెద్ద క్యాలెండర్లు %-% 2.50 లక్షలు, శ్రీ పద్మావతి అమ్మవారి పెద్ద క్యాలెండర్లు %-% 10 వేలు, శ్రీవారు, శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్లు %-% 3 లక్షలు, టీటీడీ స్థానిక ఆలయాల క్యాలెండర్లు %-% 10 వేలు అత్యంత ఆకర్షణీయంగా ముద్రించి అందుబాటులో ఉంచింది. ధరలు ఇలా ఉన్నాయి 12 పేజీల క్యాలెండర్ రూ.130/-, డీలక్స్ డైరీ రూ.150/-, చిన్న డైరీ రూ.120/-, టేబుల్ టాప్ క్యాలెండర్ రూ.75/-, 6 పేజీల 3డి డిజిటల్ క్యాలెండర్ రూ.450/-, శ్రీవారి పెద్ద క్యాలెండర్ రూ.20 /-, శ్రీ పద్మావతి అమ్మవారి క్యాలెండర్ రూ.20 /-, శ్రీవారు, శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్ రూ.15 /-, తెలుగు పంచాంగం క్యాలెండర్ %-% రూ.30/-. టీటీడీ స్థానిక ఆలయాల క్యాలెండర్లు %-% రూ.130/- . తిరుమల, తిరుపతిలో తిరుమల, తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనం ఎదురుగా సేల్స్ సెంటర్, శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయం సమీపంలోని ధ్యానమందిరం, శ్రీనివాసం, విష్ణునివాసం ప్రాంతాల్లోనూ, తిరుచానూరులో ఉన్న టిటిడి పబ్లికేషన్ స్టాల్స్‌లలో అందుబాటులో ఉన్నాయి.బయటి ప్రాంతాల్లో చెన్నైలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయాలు, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, వైజాగ్‌లోని శ్రీవారి ఆలయాలు, ముంబయి, న్యూఢిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమండ్రి, కాకినాడ, కర్నూలులోని టీటీడీ కల్యాణమండపాల్లో క్యాలెండర్లు, డైరీలు విక్రయిస్తున్నారు.అదేవిధంగా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయం, దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాలతో పాటు టీటీడీ అనుబంధ ఆలయాల్లో భక్తుల కోసం డైరీలు, క్యాలెండర్లు సిద్ధంగా ఉంచారు.

### ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు

అదేవిధంగా డైరీలు, క్యాలెండర్లు టిటిడి వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో భక్తులకు విక్రయిస్తోంది. ఇందులో 12 పేజీల క్యాలెండర్, డీలక్స్ డైరీ, చిన్న డైరీ, టేబుల్ టాప్ క్యాలెండర్, 6 పేజీల 3డి క్యాలెండర్ లను టిటిడి వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో బుక్ చేసుకున్న భక్తులకు తపాలా శాఖ ద్వారా పంపబడుతుంది.

### డిడి తీసి పంపొచ్చు

భక్తులు డిడి తీసి పంపినా టిటిడి క్యాలెండర్, డైరీలను పొందవచ్చు. ఇందుకోసం " కార్యనిర్వహణాధికారి, టిటిడి, తిరుపతి " పేరిట ఏదైనా జాతీయ బ్యాంకులో డిడి తీసి కవరింగ్ లెటర్‌తో కలిపి ష డిప్యూటీ ఈవో, పుస్తక ప్రచురణల విక్రయ విభాగం, ప్రెస్ కాంపౌండ్, కెటి.రోడ్, తిరుపతి " అనే చిరునామాకు పంపాల్సి ఉంటుంది. తపాలా శాఖ ద్వారా భక్తులకు టిటిడి క్యాలెండర్, డైరీలను పంపడం జరుగుతుంది. రవాణా ఛార్జీలను అదనంగా తపాలా శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. క్యాలెండర్, డైరీలకు సంబంధించిన ఇతర సమాచారం కోసం 0877-2264209 నంబర్లలో సంప్రదించవచ్చు.

# మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి దేశానికి చేసిన సేవలు అనన్యనీయం.

# మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్.



ధర్మవరం **కదిలించే వార్త డిసెంబర్ 11 :** ధర్మవరంమాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి చేసిన సేవలు అనన్యనీయమని, ఎందరికో స్ఫూర్తిదాయకమని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలో కాలేజీ సర్కిల్ వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. తొలుత ఎన్డీఏ కార్యాలయం నుండి బైక్ ర్యాలీగా వచ్చి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కి ధర్మవరం ఎమ్మెల్యే ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర, జిల్లా బిజెపి నాయకులు, ఎన్డీఏ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం సభాస్థలికి చేరుకున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కి ఎన్డీఏ నాయకులు స్వాగతించారు. తదుపరి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మాట్లాడుతూ ధర్మవరం ప్రజలు నేడు ఈ విగ్రహానికి ఇంత పెద్ద ఎత్తున సభకు తరలిరావడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. అటల్ మోదీ సుపరిపాలన యాత్ర లో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. 25వ తేదీ విజయవాడలో ఈ యాత్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ముగుస్తుందని తెలిపారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి దేశానికి ఎనలేని సేవలు చేశాడని, అజాతశత్రువుగా చరిత్రలో నిలిచాడని, వ్యవసాయ రంగానికి విశేష సేవలను అందించి చరిత్రపుటలో ఎక్కాడని తెలిపారు. నదులను అనుసంధానం చేసిన ఘనత వారికే దక్కిందన్నారు. వాజ్పాయ్ ఆదర్శ పాలన కొనసాగడం శుభదాయకమని తెలిపారు. గ్రామీణ సడక్ యోజన గ్రామాల్లో అభివృద్ధి చెందాయని తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్ల వ్యవస్థ కూడా అభివృద్ధిని సాధించడం జరిగిందన్నారు. గ్రామాలలోని ప్రతి సమస్యను ప్రభుత్వం ద్వారా పరిష్కరించుట వాజ్పేయి ముఖ్య లక్షము అని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాన్ని నన్ను మీ ధర్మారం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ ఆహ్వానించడం నాకెంతో సంతోషాలు ఇచ్చిందని వారు తెలిపారు. ఆ బాటలోనే నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి వల్ల నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి బాటలో ముందడుగులో ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ఎన్డీఏ ప్రభుత్వం అకుంఠిత దీక్షతో పరిపాలన కొనసాగిస్తోందని తెలిపారు. శత్రు దేశమైన పాకిస్తాన్లో ఆనాడు అటల్ బిహారీ వాజ్పేయి అడుగుపెట్టడం జరిగిందని తెలిపారు. ఏది ఏమైనా ఆనాటి దేశ పరిస్థితులను అర్థం చేసుకొని వాజ్పాయ్ తన సేవలను దేశానికే అంకితం చేసిన మహనీయుడని వారు తెలిపారు. ఎంతోమంది రాజకీయ నాయకులకు వారు స్ఫూర్తిదాతగా నిలచడం జరిగిందని తెలిపారు. అనంతరం శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ నేడు ఎన్డీఏ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అన్ని రంగాలలో ముందడుగు వేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఎన్ డి ఏ ప్రభుత్వం వచ్చినప్పుడు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంతో అభివృద్ధి బాటలో ఉంది అని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి పెట్టుబడులను తెచ్చి మరింత అభివృద్ధిని రాష్ట్రంలో చూపించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా కేంద్రంలో ప్రధానమంత్రి మోడీ సహాయ సహకారాలతో, సరి అయిన మార్గదర్శకాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపేందుకు కృషి చేస్తున్నారని వారు తెలిపారు. కేంద్రం, రాష్ట్రం స్నేహంగా ఉంటూ, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి బాటకు శ్రీకారం చుట్టేందుకు విశేష కృషిని చేస్తున్నారని వారు తెలిపారు. అనంతరం ధర్మవరం పట్టణములోని పదవ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలోని బాలబాలికలకు 1000 మందికి సైకిల్ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖామంత్రి చేతులమీదుగా సైకిల్లను పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2087 సైకిళ్లను పంపిణీ చేయడమే నా లక్ష్యము అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు,, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే రాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు శేఖర్, జిల్లాలలోని ఎన్డీఏ నాయకులు, పట్టణ బిజెపి సీనియర్ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సాయినాధునికి విశేష పూజలు

## ఆలయ అభివృద్ధికి సహకరించండి

## ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య



పులివెందుల **కదిలించే వార్త డిసెంబర్ 11 :** పులివెందుల పట్టణం పార్నపల్లి రోడ్డు మొట్టమొదటగా కొలువైయున్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయినాధునికి విశేష పూజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణం దీపాలంకరణలతో మొ క్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో ఉభయదారులచే తెల్లవారుజామున నుండి షిరిడి సాయినాధునికి కాకడ హారతి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, తదితర పూజ కైంకర్యాల అనంతరం షిరిడి సాయినాధుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ,ఈ కార్తీకమాసంలో ప్రతిరోజ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉదయము సాయంకాలము దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి దీవెనలు ఎందుకున్నారు. అన్నదాన కార్యక్రమాలకు భక్తులు ఎవరైనా వస్తురూపమైన ధన రూపేనా సహాయం చేయదలచిన వారు ఆలయంలో సంప్రదించవలెనని తెలిపారు.

**ఆలయ అభివృద్ధికి సహకరించండి**

ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా ఫలకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్




పులివెందుల **కదిలించే వార్త డిసెంబర్ 11 :** పులివెందులలోని లొయోలా డిగ్రీ కాలేజ్ పులివెందుల పరిధిలో గురువారం నాడు నిర్వహించిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. కాలేజ్ ప్రిన్సిపాల్ జోజి రెడ్డి నాయకత్వంలో,ఆర్ ఆర్ సి కోఆర్డినేటర్ వి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కడప బొగపర్వతమ్మ బ్లడ్ బ్యాంక్ వారు, అలాగే హెచ్డిఎఫ్సి బ్యాంక్%-%పులివెందుల వారు సహకారం అందించారు. ఈ శిబిరంలో లొయోలా డిగ్రీ కాలేజ్ పులివెందుల సంవత్సరం విద్యార్థులు 50 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రిన్సిపాల్ జోజి రెడ్డి రక్తదానం యొక్క మహత్తును విద్యార్థులకు సందేశ రూపంలోతెలియజేశారురక్తదానం ద్వారా మనుషుల ప్రాణాలు రక్షించగల శక్తి మన చేతుల్లో ఉందని, విద్యార్థులు ఇలాంటి సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి సి ,ఎన్ ఎస్ ఎస్ , కోఆర్డినేటర్లు. కళ్యాణి రెడ్డ, సుదీర్, స్యామ్యూల్, అలాగే ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ రమణ రెడ్డిలు పాల్గొని రక్తదానం చేశారు. కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ రఫీ విద్యార్థుల ప్రోత్సాహం, శ్రద్ధ మరియు క్రమశిక్షణను పర్యవేక్షించారు. లొయోలా డిగ్రీ కాలేజ్ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం సమాజ సేవలో మరో ముఖ్యమైన అడుగుగా నిలిచింది.

# యుటిఎఫ్ కౌన్సిల్ మండల అధ్యక్షుడిగా ఎం రాజేష్





తిరుపతి **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** రామచంద్రపురం మండల యూటీఎఫ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎం రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కమ్మ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎంపిక సమావేశం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా వై జగన్నాథం, జనరల్ సెక్రటరీ గా పి వి ఎస్ ఎన్ రాజు ఉపాధ్యక్షులు గా సిజి పరమేశ్వరి , యం వి రామకృష్ణ , కోశాధికారి గా పి హరికృష్ణారెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల, గౌరవ అధ్యక్షులు దండు రామచంద్ర య్య హాజరయ్యారు. ఎన్నికల అధికారులు గా, జిల్లా కార్యదర్శి అవని గడ్డ పద్మజ , మండల కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్ నాగేశ్వర నాయుడు వ్యవహరించారు. ఈ కార్యవర్గ ఎంపిక సమావేశానిలో 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎం రాజేష్, జనరల్ సెక్రటరీ పి వి ఎస్ ఎన్ రాజులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కౌన్సిల్ సభ్యులను శాలువులతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఫోటో రైట్ అప్

1. ఎం రాజేష్
2. పీ వి ఎస్ ఎన్ రాజు.

# ఫార్మసీ కళాశాలల్లో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి = ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డా. యం. సిరంజన్ బాబు



తిరుపతి **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలల్లో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తప్పకుండా పాటించాలని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డా. యం. సిరంజన్ బాబు అన్నారు. గురువారం మండలంలోని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ వాల్స్ ఫారసీ కళాశాలలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (ఏ ఈ బి ఏ ఎస్ ) పై ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు మరియు నోడల్ అధికారులకు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, న్యూ ఢిల్లీ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆధార్ ఆధారిత నియో మెట్రిక్ హాజరు తప్పనిసరి గా తీసుకోవాలన్నారు. ఏ ఈ బి ఏ ఎస్ విధానాన్ని అన్ని ఫార్మసీ కళాశాలలు జనవరి 1, అమలు చేయాలని కోరారు. ఏ ఈ బి ఏ ఎస్ విధానాన్ని అమలు చేయడానికి ఫ్యాకల్టీ ఐడి ఆధారిత ధ్రువీకరణను, బయోమెట్రిక్ మిషన్లు డిసెంబర్ 31 లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెస్ ప్రెసిడెంట్ జషు భాయ్ హిరాభాయ్ చౌదరి రాజరై మాట్లాడుతూ ఫార్మసీ కౌన్సిల్ ఆమోదిత ఫారసీ విద్యాసంస్థలు తప్పనిసరిగా అనుసరించవలసిన తప్పనిసరిగా అనుసరించవలసిన విధానాలను సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఐ.టి. ఛైర్మెన్ సత్యమూర్తి, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, నోడల్ ఆఫీసర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

**ఫొటోస్**

1 ప్రిన్సిపల్స్, నోడల్ ఆఫీసర్ల ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం నిరంజన్ బాబు.
2. శిక్షణ కార్యక్రమాని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దృశ్యం.
3 శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపల్ లు, నోడల్ అధికారులు

# జనవాణికి 102 వినతులు




తిరుపతి **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి 102 వినతులు అందాయి. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వీటిలో రెవిన్యూ విభాగానికి సంబంధించి 39 వినతులు వచ్చాయి. వీటిలో ఎక్కువ భాగం రేషన్ కార్డులు, ఇంటిపట్టాలు, ప్రభుత్వ భూఆక్రమణలకు సంబంధించినవి అన్నీ. కాగా మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 22 వినతులు అందాయి. పోలీస్ విభాగానికి సంబంధించి 9, డి ఎం ఎచ్ ఓ కు సంబంధించి 8 , టిటిడికి సంబంధించి 7, కలెక్టర్ కు సంబంధించి 3, ఆర్డీఓ కు ఒకటి, సబ్ రిజిస్టర్ కు ఒకటి, ఆర్టీసీకి ఒకటి, హౌసింగ్ కు సంబంధించి మూడు, టౌన్ ప్లానింగ్ కు సంబంధించి రెండు, మెప్మా కు సంబంధించి రెండు, విద్యా శాఖకు సంబంధించి ఒకటి, మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య విభాగానికి సంబంధించి ఒక వినతి ప్రజల నుంచి అందాయి. జనవాణి కార్యక్రమాన్ని ఇకపై నెలలో మొదటి శనివారం, మూడవ శనివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అధికారులను సమన్వయం చేసుకుని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్థామని ఆయన చెప్పారు. అధికారుల స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపి వాటి పరిష్కరిస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. జనవాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ అమరయ్య,హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి, ఎస్పిడిసియల్ ఏడి ఆంజనేయులు, ఏఈ ఉమాపతి, మెప్మా సీఎంఎం కృష్ణవేణి, అలిపిరి ఎస్ ఐ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు పెంపు కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా.

కనీస వేతనం 26,000 చెల్లించాలి.

సిఐటియు జిల్లా కార్యాలయంలో గోడ పత్రిక ఆవిష్కరణ.




తిరుపతి**కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** అంగన్వాడీల వేతనాల ను పెంచాలని,సుప్రీంకోర్టు తీర్పును ప్రకారం వేతనాలుఅమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్ని రకాల యాప్ లో ను ఒకటే యాప్ గా తీసుకురావాలని కోరుతూ సిఐటియు ఏఐటియుసి ఐఎఫ్టియు అనుబంధ అంగన్వాడి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రేపు పెద్ద ఎత్తున కలెక్టరేట్ ధర్నా నిర్వహించడం జరుగుతుంది.... ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది . ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ,ఐఎఫ్టియు అంగన్వాడి యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు భారతి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ జయచంద్ర టి. సుబ్రహ్మణ్యం తిరుపతి ప్రాజెక్టు కార్యదర్శి నాగరాజమ్మ,నాగరత్నమ్మ తదితరులు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులు వేతనాలు పెంపు గ్రాట్యూటి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది అన్నారు. సమ్మె సమయంలో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి కూటమి నాయకత్వం అంగన్వాడి సమ్మెలో బలపరిచారు. ఆ డిమాండ్లను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కానీ నేడు ఒకటిన్నర సంవత్సరం అవుతున్న ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. 2019 నుండి అంగన్వాడికి వేతనాలు ఒక రూపాయి కూడా పెరగలేదు. ఈ కాలంలో నిత్యవసర వస్తువులు ధరలు, విద్య వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినాయి. వర్కర్ల పైన పని భారం పెరిగింది అంగన్వాడీ నిర్వహణ సెంటర్లు రకరకాల యాపులు తీసుకొచ్చి పరిపారాన్ని పెంచారు. దీని ఫలితంగా చాలా మంది అంగన్వాడీ కార్యకర్తలు ఆత్మహత్యలకు పాల్పడం జరుగుతుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ ను నెరవీరం చేసే కుట్ర పొందుతున్నది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం చెబుతున్న వికసిత భారత్, విశ్వగురు, బేటి బచావో బేటి పడావో ఇవి నినాదాలుకే పరిమితమైంది. భారతదేశంలో ఆరు సంవత్సరాల లోపల ఉన్న పిల్లలు 37 శాతం మంది ఎదుగుదల లోపంతో ఉన్నారు.

**17% పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారు.**

ఆహారం అందక ఐదు సంవత్సరాలు పిల్లలు 8.5 లక్షల మంది మరణిస్తున్నారు.

ఐసిడిఎస్ కు కేంద్ర ప్రభుత్వం 21 కోట్ల 960 లక్షలు కేటాయించింది. ఆ నిధులతో పౌష్టికాహారం అందడం లేదు . దీని ఫలితంగా చిన్న పిల్లల మరణాల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించిన ఫలితం లేదు. అందుకు దేశవ్యాప్తంగా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగుతుంది. దీనికి వేలాదిగా తరలి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం

# ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా

## సర్పంచి అభ్యర్థి నీలం విజయలక్ష్మి రాజు



ఆత్మకూర్/ **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ళ గ్రామంలో గురువారం రోజున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీల విజయ లక్ష్మి రాజు గ్రామంలో పెద్ద ఎత్తున యువకులు మహిళలు రైతులు గ్రామస్తులు అందరితో కలిసి స్థానిక పంచాయతీఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నన్ను ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తానని గ్రామ ఓటర్లను కోరారు. నేను గ్రామ అభివృద్ధి కోసం నిత్యం పనిచేస్తానని నేను ఒక నిరుపేద కుటుంబం నుండి వచ్చిన నేను నాకు పేద ప్రజల బాధలు ఏంటో నాకు తెలుసు అని నన్ను గెలిపిస్తే గ్రామంలో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కారం చేస్తానని మీ అమూల్యమైన ఓటు వేసి నన్ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# వీ.ఆర్.ఏ ల సమస్యల పరిష్కారానికి చూపాలి

వి ఎన్ పల్లె తహసిల్దార్ గారికి వినపత్రం సమర్పించిన వీఆర్ఏలు

ఈ నెల 16 న సి సి ఎల్ ఏ ఆఫీస్ ఎదుట మహాధర్నా



కడప **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16న మంగళగిరిలో జరిగే సిసిఎల్ఏ ఆఫీస్ ఎదురు జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏపీ వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య. జిల్లా జేఏసీ నాయకులు వెంకటసుబ్బయ్య పుల్లయ్య లు కోరారు. గురువారం వీరపునాయినిపల్లె మండల తహసిల్దార్ వారికి వీఆర్ఏలు ధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా వీఆర్ఏ జేఏసీ నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా తాము అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని... వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేసి, నామిని వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు భోగాది, ముస్తఫా, కేశవ, అమీన, అరుణ కుమారి, లక్ష్మి, శంకర్ గోపాల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# భూకబ్జాలు చేసే అలవాటు నాకు లేదు

# వేంపల్లి మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి

## సమాజానికి ఉపయోగపడే వార్తలను రావాలి



వేంపల్లె **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయాల్సిన అవసరం తమకు లేదని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే వార్తలను జర్నలిస్టులు రాయాలని కోరారు. వాస్తవాలు తెలుసుకోకుండా తనపై అసత్య వార్తలు రాస్తే సహించేది లేదని అలాంటి వారిపై చట్టపరంగా (లీగల్) చర్యలు తీసుకుంటామని తెలిపారు. తన పరువుకు భంగం కలిగించేందుకు కావాలని కొందరు పత్రికల్లో తప్పుడు రాతలను రాయిస్తున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వ పాలనలోనే ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారులు కంచె వేయడం జరిగిందని చెప్పారు. ఈ విషయం వేంపల్లె ప్రజలందరికి తెలుసు అన్నారు. తాను ఎక్కడా భూకబ్జాలకు పాల్పడిన చరిత్ర లేదన్నారు. మాది వ్యవసాయ కుటుంబం అని రైతు బిడ్డగా వ్యవసాయం చేసుకుంటూ, మరోవైపు ప్రజాసేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చాను తప్పా అక్రమార్జన కోసం కాదన్నారు. తాను పంచాయితీలు చేసి డబ్బులు సంపాదిస్తున్నానని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. నాకు ఎలాంటి ఫ్యాక్టరీలు గాని, బినామీలు గాని లేవని స్పష్టం చేశారు. ?పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి జరుగుతున్న వరుస చేరికలను చూసి ఓర్వలేకే, కొందరు గిట్టనివారు తనపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళ్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఇటీవల వేంపల్లెలో చరిస్మా కలిగిన నేతలు టిడిపిలో చేరుతుండడంతో ఓర్వలేకే బురద చల్లడం జరుగుతున్నదని చెప్పారు. జగన్ ను మానసికంగా దెబ్బ తీస్తున్నారనే కారణంతో కొంత మంది కొన్ని ప్రలోభాలకు గురై సంబంధం లేకున్న తమపై అరోపణలు చేయడం శోచనీయం అన్నారు. ప్రజలకు, నాయకులకు తాను చేతనైనా సహాయం చేస్తానే తప్పా తప్పుడు పనులు చేయనని అన్నారు. భూకబ్జాకు పాల్పడిన ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందో కూడ తనకు తెలియదు అన్నారు. అలాంటి భూమి తాను ఎందుకు కబ్జా చేస్తానని చెప్పారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, మండల కార్యదర్శి తక్కెల షరీఫ్, జబిబుల్లా, డక్కా రమేష్, బాలకృష్ణారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాసిన్, సెట్, ఫయాజ్, మిలిటరి శివ తో పాటు పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

# ఈనెల 15వ న స్వాతంత్ర ప్రధమ సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహ భూమి పూజ



కడప **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** దేశ స్వాతంత్య్ర ప్రధమ సమరయోదులు వడ్డె ఓబన్న విగ్రహ భూమి పూజ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు.కడప నగరం ఎర్రముక్కపల్లెలోని వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయంలో ఈనెల 15వ తేదిన కడప%-%తిరుపతి మార్గంలోని జేఎంజే కళాశాల వద్ద జరిగే వడ్డె ఓబన్న విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించి భూమి పూజ కార్యక్రమ కరపత్రాలను సంఘ నేతలు ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 19వ శతాబ్దంలో బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడిన రేనాటి వీరుడు వడ్డె ఓబున్న వడ్డెర కులానికి చెందిన వారన్నారు. 1846లో బ్రిటీషు పాలననుఎదిరించి సాయుధ పోరాటం చేసి వీర మరణం పొందిన ఆయన చరిత్ర, త్యాగాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వడ్డె ఓబన్న చిన్ననాటి నుంచి సామాజిక అసమానతలను దగ్గరగా చూశారని, దళితులు, బహుజన వర్గాల పేదరికం అణిచివేతలను ఆయను తీవ్రంగా ప్రభావితం చేసింది. అటువంటి మహానీయుని విగ్రహ ఏర్పాటుకు సంబంధించి నిర్వహిస్తున్న భూమి పూజ కార్యక్రమంలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ఓర్సు బాలకొండయ్య. జి. రమణయ్య,జిల్లా అధ్యక్షులు చంద్రగిరి నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయచోటి వెంకటసుబ్బయ్య, సలహాదారుడు వీర భాస్కర్, జిల్లా యువత అధ్యక్షుడు నంద్యాల నాగరాజు, సిటీ యూత్ అధ్యక్షుడు నంద్యాల ప్రసాద, నగర అధ్యక్షుడు నగర అధ్యక్షుడు దేరంగుల శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గోగుల కృష్ణ, తమ్మిశెట్టి రమణ, బత్తల గోపి, తమ్మిశెట్టి సుబ్బరాయుడు, ఎం. రంగనాయకులు, నంద్యాల ఆదినారాయణ రాయచోటి వెంకటసుబ్బయ్య. తమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# 13వ డివిజన్లో అండర్ డ్రైనేజ్ లో వాటర్ క్లీన్



కడప **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** కడప నగరం13 డివిజన్ ఓంశాంతి నగర్ రోడ్ నెంబర్ 6 లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో వాటర్ పైకి పొంగి చాలా దుర్వాసన ఇబ్బందికరంగా ఉందని ప్రజలు తెలిపిన వెంటనే కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలమేరకు గురువారం 13వ డివిజన్ ఇన్చార్జ్ చిట్టి బోయిన సుబ్బరాయుడు యాదవ్ నగరపాలక శానిటేషన్ వారికి కంప్లైంట్ చేసి జట్టు గల్ఫర్ తెప్పించి వాటర్ ను క్లీన్ చేపించడం జరిగిందన్నారు.

# డిప్యూటీ ఎంపిడిఓగా రమణయ్య బాధ్యతలు



వేంపల్లె **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** వేంపల్లె మండల డిప్యూటీ ఎంపిడిఓగా రమణయ్య బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పదోన్నతులు కల్పించడం జరిగింది. ఈ నేపథ్యంలో గాలివీడు ఎంపిడిఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న రమణయ్య డిప్యూటీ ఎంపిడిఓగా పదోన్నతి పొందారు. దీంతో వేంపల్లె మండలంలోని జిఎస్ డబ్యుఎస్ లకు కొత్తగా డిప్యూటీ ఎంపిడిఓగా బదిలీపై వచ్చారు. ఈనేపథ్యంలో గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఓగా రమణయ్య బాధ్యతలను స్వీకరించడంతో కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయం అధికారులు ఆయనను శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు మెరుగైన సేవాలు అందించేందుకు సిబ్బంది సహకరించాలని కోరారు. జిఎస్ డబ్యుఎస్ డిప్యూటీ ఎంపీడీవో నాయకత్వంలో గ్రామ సచివాలయం కార్యకలాపాలు బలోపేతం అవుతాయని పలువురు సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తూ నిబద్ధత, నిజాయితీ, సేవాభావం కలిగిన అధికారిగా మంచి పేరును సంపాదించిన వ్యక్తి రావడం సంతోషంగా ఉందని డిప్యూటీ ఎంపిడిఓ రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రఘునాథ్ రెడ్డి, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ఎంపిడిఓగా రమణయ్య బాధ్యతలు



వేంపల్లె **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** వేంపల్లె మండల డిప్యూటీ ఎంపిడిఓగా రమణయ్య బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పదోన్నతులు కల్పించడం జరిగింది. ఈ నేపథ్యంలో గాలివీడు ఎంపిడిఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న రమణయ్య డిప్యూటీ ఎంపిడిఓగా పదోన్నతి పొందారు. దీంతో వేంపల్లె మండలంలోని జిఎస్ డబ్యుఎస్ లకు కొత్తగా డిప్యూటీ ఎంపిడిఓగా బదిలీపై వచ్చారు. ఈనేపథ్యంలో గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఓగా రమణయ్య బాధ్యతలను స్వీకరించడంతో కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయం అధికారులు ఆయనను శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు మెరుగైన సేవాలు అందించేందుకు సిబ్బంది సహకరించాలని కోరారు. జిఎస్ డబ్యుఎస్ డిప్యూటీ ఎంపీడీవో నాయకత్వంలో గ్రామ సచివాలయం కార్యకలాపాలు బలోపేతం అవుతాయని పలువురు సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తూ నిబద్ధత, నిజాయితీ, సేవాభావం కలిగిన అధికారిగా మంచి పేరును సంపాదించిన వ్యక్తి రావడం సంతోషంగా ఉందని డిప్యూటీ ఎంపిడిఓ రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రఘునాథ్ రెడ్డి, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థ గౌరవాన్ని పెంచే బాధ్యత న్యాయవాదులదే

## ఐఏఎల్ డైరీల ఆవిష్కరణలో జిల్లా జడ్జి యామిని



కడప **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** మనదేశంలోని కార్యనిర్వాహక వ్యవస్థలు చేసే చట్ట వ్యతిరేక చర్యలను కనిపెట్టి అవి సరైన మార్గంలో నడవడానికి న్యాయవ్యవస్థ పనిచేసే విధంగా రాజ్యాంగం న్యాయవ్యవస్థకు హక్కులు కల్పించిందని అందుకే న్యాయవ్యవస్థకు ఉన్నతమైన గౌరవం మన దేశంలో ఉన్నదని ఆ గౌరవాన్ని నిలబెట్టే బాధ్యతను న్యాయవాదులపైనే ఉంటుందని కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని అన్నారు. గురువారం సాయంత్రం భారత న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సి .సుబ్రహ్మణ్యం వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్ నేతృత్వంలో ఐఏఎల్ 2026 డైరీలను ఆమె విడుదల చేశారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మనదేశంలోని న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తితో పాటు అత్యున్నత స్థానం ఉన్నదని బాధితుల హక్కుల రక్షణ కవచంగా న్యాయవ్యవస్థ పనిచేస్తుందని న్యాయవ్యవస్థకు ఉన్న ఈ గౌరవాన్ని మరింత పెంచడానికి న్యాయవాదుల పై ఉంటుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్ కుమార్ జిల్లా నాయకులు నాగ ముని,రాజగోపాల్ రెడ్డి బి ఎన్ అక్బర్ అలీ ఖాన్ , ఎన్ వెంకట్ శివ సుబ్బరామయ్య, నాగభూషణం సూర్యనారాయణ రెడ్డి, ప్రభావతి ఆయేషా ,రాఘవేంద్ర అట్లూరి బాలసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# 47వ డివిజన్లో స్వచ్ఛకడప.



కడప **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** కడప నగరం 47 వ డివిజన్‌లోని శాస్త్రి నగర్ పరిధిలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రతిష్టాత్మక "మన కడప %-% స్వచ్ఛ కడప" కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతంలోని శుభ్రత పరిస్థితులు, డ్రైనేజ్, చెత్త నిర్వహణ,పారిశుధ్యాలపై అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానికంగా పరిశుభ్రత పనులు మరింత సమర్థవంతంగా కొనసాగించాలని మున్సిపల్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి డివిజన్ ఇంచార్జి రెడ్డి టిడిపిహుస్సేన్, లోమడ మనోజ్ కుమార్ రెడ్డి.బూత్ ఇంచార్జి చిన్న హుస్సేన్ , మహమ్మద్ హుస్సేన్,వెంకట రామిరెడ్డి,హరి , జీవన్ పాల్ .,ఆదిలక్ష్మి,సుభాహన్, ఇబ్రహీం,హుస్సేన్,తదితరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంకాళమ్మ గూడూరు గ్రామంలో కోర్ కమిటీ సమావేశం





సింహాద్రిపురం**కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** సింహాద్రిపురం మండలం అంకాళమ్మ గూడూరు గ్రామంలో కోర్ కమిటీ సమావేశ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ అబ్జరవర్లు హిమకుంట్ల కిషోర్ రెడ్డి, హృశికేసవ రెడ్డి, సుదర్శన్ రెడ్డి..భాస్కర్ రెడ్డి, చెన్న కేశవ రెడ్డి, అంకాలమ్మ గూడూరు వైస్సార్సీపీ నాయకులు అశోక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నర్సారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, వంశీ రెడ్డి, సోమిరెడ్డి,ఆనంద్ రెడ్డి, అమర్ నాథ్ రెడ్డి, అరవింద్ నాథ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, చిన్న శేఖర్ రెడ్డి, గంగరాజు, రాయుడు, భాస్కర్, రితన్, సెల్ ఉపాధ్యక్షుడు రేలా నాగరాజు, అంకాలమ్మ గూడూరు మహిళా నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి విజయ లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికురుల పని చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని పలు విషయాలు సూచించారు ఈ కార్యక్రమంలో సింహాద్రిపురం మండల వైకాపా నాయకులుపాల్గొన్నారు

## అటల్ బిహారీ వాజ్పేయి దేశానికి చేసిన సేవలు మరుపురానివి

## టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి.



ధర్మవరం**కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** అటల్ బిహారీ వాజ్పేయి దేశానికి చేసిన సేవలు మరుపు రానివని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో మాజీ ప్రధాని వాజ్పాయ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తో పాటు పాల్గొన్నారు. అనంతరం పరిటాల శ్రీరామ్, చిల కంమధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సంస్కృతి సేవా సమితి సహకారంతో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ సభకు భారీ ఎత్తున ప్రజానీకం హాజరు కావడం చరిత్రకు ఒక శుభ సూచకమని తెలిపారు. దీంతో కూటమి శ్రేణుల్లో ఆనంద ఉత్సవాలు సంతరించుకున్నాయని తెలిపారు. శత్రుదేశం అయిన పాకిస్తాన్లో ఆనాడు వాజ్పేయి అడుగుపెట్టడం జరిగిందని, వారు అందరికీ ఆదర్శప్రాయులని, నీతి నిజాయితీ వారి లక్ష్యము అని వారు తెలిపారు. సుపరిపాలన యాత్రలు చేయడం ఎన్డీఏ కూటమికి మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని భవిష్యత్ తరాలకు మార్గదర్శక అందించడం జరిగిందని తెలిపారు. ఈ సభకు ఎన్డీఏ కూటమి పార్టీలైన బిజెపి టిడిపి టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు అందరూ సహాయ సహకారములు అందించడం వల్లనే విజయదుందుభి మోగిచ్చిందని తెలిపారు. కూటమి నాయకుల్లో మరింత ఉత్సాహాన్ని ఘనపరిచినట్లు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే రాజు, ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగిందని వారు తెలిపారు.

## హోటల్ యజమాని పై దారుణ దాడి

# భార్యాభర్తలకు గాయాలు



ఆత్మకూర్ /**కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** నీరుకుళ్ళ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు హోటల్ యజమాని ఆర్షం రాజ్ కుమార్ పై గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. చలి వాగు హైవే పక్కన భార్యాభర్తలు కలిసి నడిపిస్తున్న హోటల్‌కు మధ్యాహ్నం 12:50 గంటలకు ముగ్గురు వ్యక్తులు వచ్చి సిగరెట్ కోరారు. సిగరెట్ ఇచ్చిన కొద్దిసేపట్టే చిన్న మాటలోపే వారిలో ఒకరు రాజ్ కుమార్‌పై అకస్మాత్తుగా దాడి చేశారు. ఫింగర్ స్టిక్‌తో కొట్టి ముఖంపై దాడి చేయడంతో ముక్కు, పెదవులు తీవ్రంగా గాయపడ్డాయి. మిగతా ఇద్దరు వ్యక్తులు గొడ్డలి, కత్తులతో రాజ్ కుమార్‌ను దాడి చేయగా, మధ్యలో అడ్డుకొని నిలువరించే ప్రయత్నం చేసిన ఆయన భార్యను కూడా దుండగులు తీవ్రంగా కొట్టినట్లు తెలుస్తోంది. రాజ్ కుమార్ నేలకుపడగా, కాసేపటికి లేచి సమీపంలోని హమాలీల వద్దకు వెళ్లగా వారు స్పందించి దంపతులను రక్షించారు. స్థానికుల సహాయంతో వెంటనే 108 ద్వారా గార్డియన్ హాస్పిటల్‌కు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# పోస్టర్ ఆవిష్కరణ బిజెపి



రేణిగుంట **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** ఈనెల 14న రేణిగుంట హైవే మర్రిగుంట కూడలి లో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్పేయి విగ్రహాన్ని ఆవిష్కరించినన్నారు. అటల్ బిహారీ వాజ్పేయి ఆశయ సాధన ప్రధాని మోడీతోనే సాధ్యమవుతుందన్న నానుడితో బిజెపి సుపరిపాలన యాత్ర జిల్లాలో కొనసాగిస్తోంది. 14 న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలందరూ తరలిరావాలని పిలుపునిస్తూ బిజెపి తిరుపతి సెంట్రల్ మండల సమావేశం మండల అధ్యక్షుడు దీపక్ యాదవ్ ఆధ్వర్యంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు గుండాల గోపీనాథ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష రామకృష్ణ కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్ బిజెపి సెంట్రల్ మండల ప్రధాన కార్యదర్శి కరుణాకర్ రెడ్డి ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి బిజెపి నాయకులు మునికృష్ణయ్య ఏ వన్ మస్తాన్ హరి తదితరులు పాల్గొన్నారు

## యూరియా పంపిణీలో అక్రమాలు అవాస్తవం

### ప్రతి రైతుకు ప్రభుత్వం యూరియా పంపిణీ చేస్తున్నది = ఎం తిరుమల రెడ్డి.

### అసత్య ప్రచారాలు మాని..... రైతుల అభివృద్ధికి సహకరిస్తే మంచిది.



తిరుపతి **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా రబీ సీజన్లో వ్యవసాయానికి ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం యూరియా, జిప్సం అందజేసి ఆదుకుంటుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి అన్నారు. గురువారం సింగల్ విండో కార్యాలయంలో యూరియా పంపిణీపై వచ్చిన అసత్య కథనాలను టిడిపి నాయకులు ఖండించారు. ఖరీఫ్ రబీ సీజన్లలో రైతుల వ్యవసాయానికి సకాలంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రతి రైతుకు ఎరువులు అందిస్తుంటే బ్లూ మీడియాలో అసత్య కథనాలు వ్రాసి ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. మండలంలో 1400ఎకరాలలో పంట సాగుకు 2255 యూరియా బస్తాలను రైతులకు అందజేశామని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ ఎన్ చినబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వంపై బురద చాల్లేందుకు యూరియాలో కంపెనీలో అక్రమాలు జరిగినట్లు, అధిక రేట్లకు అమ్ముకున్నట్లు బ్లూ మీడియా రోత రాతలు వ్రాయడం మానుకోవాలన్నారు. సింగల్ విండో ఛైర్మన్ సి జనార్దన్ చౌదరి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే బ్లూ మీడియా అసత్య కథనాలు ప్రచురించడం విడ్డూరంగా ఉందన్నారు. అసత్య ప్రచారాలు మాని... రైతుల సంక్షేమానికి సూచనలు సలహాలు ఇస్తే మంచిదన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి బి మమత మాట్లాడుతూ ప్రతి రైతుకు దశలవారీగా యూరియా అందజేస్తాం..... ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కోరా హరి ప్రసాద్, రావిళ్ళ గిరినాయుడు, కమలాకర్ రెడ్డి, మురళీమోహన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోటో రైట్ అప్

1. మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు.

## ఆత్మకూరును నియోజకవర్గ కేంద్రంగా మారుస్తాం

# చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి





ఆత్మకూరు,/ **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** డిలిమిటేషన్లో ఆత్మకూరుకు నియోజకవర్గ హోదా తీసుకురావడంతో పాటు గ్రామాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయడం తన ధృడ సంకల్పమని కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో కుల సంఘాలతో సమావేశంలో మాట్లాడిన ఆయన, "నా జన్మస్థానమైన ఆత్మకూరును మున్సిపాలిటీగా మార్చి ప్రభుత్వం నుంచి భారీ నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తాను" అని ప్రకటించారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి పర్వతగిరి మహేశ్వరంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వార్డ్ సభ్యులందరినీ అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అప్పుడే అభివృద్ధి పనులు వేగంగా సాగుతాయని పేర్కొన్నారు. పది సంవత్సరాలపాటు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ నేతలు ప్రజల అభివృద్ధిని మరిచి సొంత ప్రయోజనాలకే పాల్పడ్డారని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. "పది సంవత్సరాలు అధికారంలో ఉన్నా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. ఇప్పుడు మళ్లీ మాయమాటలతో జనాలను మోసగించేందుకు వస్తున్నారు. వారి మాటలు నమ్మకండి," అని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరదలాగా సంక్షేమాన్ని అందిస్తున్నదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ గృహాలు, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, వడ్డీలేని రుణాలు, రైతులకు రుణమాఫీ, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు అందజేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించిన విషయాన్ని గుర్తుచేసిన ఆయన, "ఆత్మకూరును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఆర్మీ ఉద్యోగాన్ని వదిలి వచ్చిన పర్వతగిరి మహేశ్వరుని భారీ మెజార్టీతో గెలిపించండి" అని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థులను గెలిపించండి: రావు పద్మ



ఆత్మకూరు,/**కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బయ్య రమతో పాటు వార్డ్ మెంబర్ అభ్యర్థుల గెలుపుకోసం ఆత్మకూరులో ఇంటింటికీ ప్రచారం జరిగింది. రాష్ట్ర నాయకులు, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి కేంద్ర నిధుల ద్వారానే సాధ్యమని, బయ్య రమకు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను భయపెడుతోందని, పథకాలు నిలిపివేస్తామన్న ధోరణికి ప్రజలు శాసనం చెప్తారని విమర్శించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనల్లో పంచాయతీలకు నిధులు అందలేదని, గ్రామాల అభివృద్ధికి కేంద్ర నిధులే ఆధారం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిటిడి చైర్మన్ శ్రీ బీ.ఆర్ నాయుడు గారిని కలిసిన

## శ్రీశైలం దేవస్థానం పాలకమండలి చైర్మన్



తిరుమల **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** పాలక మండలి సభ్యులు టిటిడి చైర్మన్ శ్రీ శ్రీ బీఆర్ నాయుడును హైదరాబాద్ లోని టిటిడి ఛైర్మన్ కార్యాలయంలో గురువారం శ్రీశైలం దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ శ్రీ పి. రమేష్ నాయుడు మరియు బోర్డ్ సభ్యులు కలిసారు ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి టిటిడి సహకారం అందించాలని కోరారు. శ్రీశైలంలో నూతనంగా కాటేజ్ ల నిర్మాణానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం దేవస్థానంను సందర్శించి దేవస్థాన అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు శ్రీశైలం దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ సభ్యుల అభ్యర్ధనను టిటిడి బోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని టిటిడి బోర్డు చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు హామీ ఇచ్చారుఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ ను సత్కరించి శ్రీశైలం దేవస్థానం స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు

## తిరుమలలో ప్రయోగాత్మకంగా రిసైకిల్ మిషన్ల

# ఏర్పాటుపై అదనపు ఈవో సమీక్ష





తిరుమల **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** తిరుమలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా రిసైకిల్ మిషన్ల ఏర్పాటుపై గురువారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు సెప్టెంబర్ నెలలో ప్రయోగాత్మకంగా తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-5 -5) లో ఏర్పాటు చేసిన రెక్లెయిమ్ డిపాజిట్ రీఫండ్ మిషన్లకు విశేష స్పందన రావడంతో తిరుమలలో ఈ మిషన్లను మరి కొన్నింటిని పరిశీలనాత్మకంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు తిరుమలలో టెట్రాపాక్ మరియు టిన్ లలో పానీయాలను స్వీకరించిన అనంతరం భక్తులు ఎక్కడంటే అక్కడ పడేయకుండా ఈ డిపాజిట్ రీఫండ్ మెషిన్ల లో వేస్తే తిరుమలలో పరిశుభ్రత మరింత మెరుగు పడేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు ఈ విషయం పై తిరుమలలోని వ్యాపారులు టెట్రా ప్యాక్ డీలర్లు కూడా తోటి వారిలో అవగాహన కల్పించాలని కోరారు స్వచ్ఛ తిరుమలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడంలో భాగంగా ఒక ఉద్యమంలా రెక్లెమ్ రీసైకిల్ మెషిన్లపై భక్తులకు విస్తృతంగా అవగాహన కల్పించి తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మరిన్ని మెషిన్ల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు ఈవో ఆదేశించారు ఈ సమావేశంలో డీఎఫ్ఓ శ్రీ ఫణి కుమార్ నాయుడు డిప్యూటీ ఈవోలు శ్రీ సోమన్నారాయణశ్రీ వేంకటేశ్వర్లు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధు సూదన్, డిప్యూటీ ఈఈ శ్రీ శ్రీనివాస్ రెక్లెమ్ రీసైకిల్ సంస్థ ప్రతినిధులు శ్రీ కిరణ్, శ్రీ రవి తదితరులు పాల్గొన్నారు

# టిటిడి డైరీలు నూతన సంవత్సరం క్యాలెండర్లకు భక్తుల నుండి విశేష స్పందన

### ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు





తిరుమల**కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** డిడి తీసి పంపినా పొందవచ్చు టీటీడీ ముద్రించిన 2026 సంవత్సర క్యాలెండర్లు డైరీలకు దేశ విదేశాలలోని శ్రీవారి భక్తుల నుండి విశేష స్పందన వస్తోంది శ్రీవారి భక్తుల సౌకర్యార్థం టీటీడీ 2026 సంవత్సరం 12 పేజీల క్యాలెండర్లు 13 లక్షలు, 6 పేజీల క్యాలెండర్లు 75 వేలు, పెద్ద డైరీలు 8.50 లక్షలు, చిన్నడైరీలు 3 లక్షలు టేబుల్ టాప్ క్యాలెండర్లు 1.50 లక్షలు శ్రీవారి పెద్ద క్యాలెండర్లు 2.50 లక్షలుశ్రీ పద్మావతి అమ్మవారి పెద్ద క్యాలెండర్లు 10 వేలు, శ్రీవారు, శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్లు - 3 లక్షలు, టీటీడీ స్థానిక ఆలయాల క్యాలెండర్లు - 10 వేలు అత్యంత ఆకర్షణీయంగా ముద్రించి అందుబాటులో ఉంచింది

**ధరలు ఇలా ఉన్నాయి**

12 పేజీల క్యాలెండర్ రూ.130/ డీలక్స్ డైరీ రూ.150/ చిన్న డైరీ రూ.120 టేబుల్ టాప్ క్యాలెండర్ రూ.75/ 6 పేజీల 3డి డిజిటల్ క్యాలెండర్ రూ.450/ శ్రీవారి పెద్ద క్యాలెండర్ రూ.20 / శ్రీ పద్మావతి అమ్మవారి క్యాలెండర్ రూ.20 / శ్రీవారు, శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్ రూ.15 / తెలుగు పంచాంగం క్యాలెండర్ రూ.30/ టీటీడీ స్థానిక ఆలయాల క్యాలెండర్లు రూ.130/ తిరుమల, తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనం ఎదురుగా సేల్స్ సెంటర్, శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయం సమీపంలోని ధ్యానమందిరం, శ్రీనివాసం, విష్ణునివాసం ప్రాంతాల్లోనూ, తిరుచానూరులో ఉన్న టిటిడి పబ్లికేషన్ స్టాల్స్‌లలో అందుబాటులో ఉన్నాయి

**బయటి ప్రాంతాల్లో**

చెన్నైలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయాలు, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, వైజాగ్‌లోని శ్రీవారి ఆలయాలు, ముంబయి, న్యూఢిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమండ్రి, కాకినాడ, కర్నూలులోని టీటీడీ కల్యాణమండపాల్లో క్యాలెండర్లు, డైరీలు విక్రయిస్తున్నారు అదేవిధంగా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయం, దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాలతో పాటు టీటీడీ అనుబంధ ఆలయాల్లో భక్తుల కోసం డైరీలు, క్యాలెండర్లు సిద్ధంగా ఉంచారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని అదేవిధంగా డైరీలు క్యాలెండర్లు టిటిడి వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో భక్తులకు విక్రయిస్తోంది. ఇందులో 12 పేజీల క్యాలెండర్, డీలక్స్ డైరీ చిన్న డైరీ టేబుల్ టాప్ క్యాలెండర్, 6 పేజీల 3డి క్యాలెండర్ లను టిటిడి వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో బుక్ చేసుకున్న భక్తులకు తపాలా శాఖ ద్వారా పంపబడుతుంది

**డిడి తీసి పంపొచ్చ**

భక్తులు డిడి తీసి పంపినా టిటిడి క్యాలెండర్, డైరీలను పొందవచ్చు. ఇందుకోసం కార్యనిర్వహణాధికారి, టిటిడి, తిరుపతి " పేరిట ఏదైనా జాతీయ బ్యాంకులో డిడి తీసి కవరింగ్ లెటర్‌తో కలిపి ష డెప్యూటీ ఈవో పుస్తక ప్రచురణల విక్రయ విభాగం, ప్రెస్ కాంపౌండ్, కెటి.రోడ్, తిరుపతి అనే చిరునామాకు పంపాల్సి ఉంటుంది. తపాలా శాఖ ద్వారా భక్తులకు టిటిడి క్యాలెండర్ డైరీలను పంపడం జరుగుతుంది. రవాణా ఛార్జీలను అదనంగా తపాలా శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. క్యాలెండర్, డైరీలకు సంబంధించిన ఇతర సమాచారం కోసం 0877-2264209 నంబర్లలో సంప్రదించవచ్చు

## వై సి పి పార్టీ సంస్థగతంగా బలోపేతనికే

### కోర్ కమిటీ సమేవేశం



సింహాద్రిపురం **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** వై సి పి పార్టీ సంస్థగతంగా బలోపేతనికే కోర్ కమిటీ సమేవేశలు నిర్వహించడం జరుగుతుందని సింహాద్రిపురం మండల వైకాపా నాయకులు పేర్కొన్నారు. గురువారం గ్రామాలలో వైస్సార్సీపీ పార్టీ సంస్థగతంగా బలోపేతం చేయుట కొరకు మాజీ ముఖ్యమంత్రి వై. యస్. జగన్ మోహన్ రెడ్డి వారి ఆదేశాల మేరకు సింహాద్రిపురం మండలం తెలికి గ్రామపంచాయతీ లో కోర్ కమిటీ సమావేశ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల పరిశీలకులు ఎక్స్ - మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్నపూస రామమోహన్ రెడ్డి, సాకం నీలవర్ధన్ రెడ్డి, సర్పంచ్ లు బాబు రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, దేవతపురం బాబు రెడ్డి, శివ రెడ్డి, ఓబులేసు, పరమేశ్వర రెడ్డి, బాబు రెడ్డి, మల్లేశ్వర రెడ్డి, రవికుమార్ రెడ్డి, వి. చెన్నకేశవ రెడ్డి, మహేశ్వర రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,మైనారిటీ నాయకుడు ఎమ్ ఏ బషీర్, షబ్బీర్ గోవర్ధన్ రెడ్డి, సురేష్

## ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం




కడప**కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** హాది వెల్ఫేర్ అండ్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ మహమ్మద్ ఇబ్రహీం షేక్ జాతీయ సలహాదారులు కే అషరఫ్ అలీ ఖాన్ రఫీ ఖాన్ కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ కాలేశా సెక్రటరీ ఏజాస్ అహ్మద్ సభ్యులు వారి ఆధ్వర్యంలోప్రపంచ మానవ హక్కుల దినోత్సవం రహమతీయ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించడమైనది. విద్యార్థులకు పౌరులకు తమ అమూల్యమైన సందేశాన్ని అందించుటకు ఈ వేడుకకు విశిష్ట అతిథులు ఎస్ బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ కం సివిల్ జడ్జ్ సీనియర్ డివిజన్ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కడప. రాజశేఖర్ బెల్లంకొండ, వైస్ ఛాన్సలర్ యోగివేమన యూనివర్సిటీ, షరీఫ్ ఖాన్ సి ఏ కం ఆడిటర్ ఇన్కమ్ టాక్స్, ఫరూక్ కరస్పాండెంట్ భారత్ ఇంజనీరింగ్ కాలేజ్ సునీత, కే ఓ ఆర్ ఎం ప్రిన్సిపల్ ఇతర కళాశాలల గౌరవ ప్రిన్సిపలు, అధ్యాపకులు నగర ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు మా అల్ హాది వెల్ఫేర్ అండ్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ తరపున వారికి హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుతున్నాము. విశిష్ట అతిథులు వారి అమూల్యమైన సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన, పాల్గొన్న ప్రతి ఒక్క విద్యార్థికి పేరుపేరునా శుభాకాంక్షలు తెలుపుతున్నాము.మానవ హక్కులు, సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం అనే అంశంపై నిర్వహించిన ఒక ఎస్సే కాంపిటీషన్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మొమెంటులు ఎస్సే కాంపిటీషన్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ అండ్ అప్రిసియేషన్ సర్టిఫికెట్ ని గౌరవ అతిథుల చేతుల మీదుగా అందించడమైనది. ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు మా అల్ ది వెల్ఫేర్ అండ్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## మహిళల భద్రత ,సైబర్ క్రైమ్

## ట్రాఫిక్ పై విద్యార్థులకు అవగాహన క



పులివెందుల **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** మహిళల భద్రత ,సైబర్ క్రైమ్ మరియు ట్రాఫిక్ పై.జె ఎన్ టి యూ కాలేజ్ విద్యార్థులకు పులివెందుల డి.యస్.పి . మురళి, ఇన్స్పెక్టర్స్ సీతారామిరెడ్డి మరియు హాజివలి అవగాహన కల్పించరు. ఈ సందర్భముగా డి.యస్.పి మరియు ఇన్స్పెక్టర్లు మాట్లాడుతూ.. ప్రస్తుతము రోజురోజుకు సైబర్ క్రైమ్ రేటు పెరుగుతుందని దీనిపట్ల ప్రతిఒక్కరు పూర్తి అవగాహన తప్పనిసరి అని గుర్తుచేసారు. ఎట్టిపరిస్థితులలో తెలియని వ్యక్తులకు మీ ఓ టి పి , బ్యాంక్ వివరాలు, పాస్వర్డ్ ఎవరికి తెలియచేయవద్దని సూచించారు. అపరిచితుల నుండి వచ్చే లింకులు, మెసేజ్‌లు, కాల్స్ నమ్మవద్దని, డిజిటల్ అరెస్ట్ అనేది అంతా భూటకమని గుర్తుచేసారు. స్క్రీన్ షేరింగ్ యాప్స్ ఎవరితోనూ ఉపయోగించవద్దని లోన్ యాప్స్ నకు దూరముగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం, ఫోటోలు జాగ్రత్తగా ఉంచుకోవలేనని తెలిపారు. మోసపోతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి లేదా లో ఫిర్యాదు చేయండి. మహిళల భద్రత: అనుమానాస్పద వ్యక్తులు, ప్రదేశాలు, వాహనాలను దూరంగా ఉంటూ పోలీసులకు తెలియజేయాలని సూచించారు. రాత్రివేళ ఒంటరిగా ప్రయాణించినప్పుడు లొకేషన్‌ను కుటుంబ సభ్యులతో షేర్ చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100 / 1091 / 112 వంటి మహిళా హెల్ప్ లైన్ లకు వెంటనే కాల్ చేయవలెననని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పబ్లిక్‌గా పెట్టకుండా ప్రైవసీ సెట్టింగ్స్ కఠినంగా ఉంచండి వేధింపులు, స్టాకింగ్, బెదిరింపులు జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. ట్రాఫిక్ విషయముగా ప్రతిఒక్కరు రోడ్డు క్రాస్ చేయు సమయములో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, ముందు, వెనుక మరియు ప్రక్కన గమనిస్తూ వెళ్ళవలసిందిగా గుర్తుచేసారు. ప్రతి వాహన చోదకులు సెల్ ఫోన్ డ్రైవింగ్, మధ్యము సేవించి వాహనాలు నడుపుట, పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణము చేయుట మరియు అతివేగము వంటి చర్యలకు దూరముగా ఉంటూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు.

## శ్రీ సిటీ ఫేజ్ -2 కు భూసేకరణ పనులు వేగవంతం

## చేయండి : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్ **కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** తిరుపతిలో డిసెంబర్ 11 శ్రీ సిటీ ఫేజ్ -2 కు సంబందించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలు నందు శ్రీ సిటీ ఫేజ్ 2 కి సంబందించి వెబ్ ల్యాండ్, ఎల్ జి ఫేజ్-1,2 పెండింగ్ భూసేకరణ పనులు కోర్టు కేసులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షా నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సిటీ ఫేజ్ -2, ఎల్ జి ఫేజ్ -1,2కు సంబందించి పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టులకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షీ సూళ్లూరుపేట ఆర్డిఓ కిరణ్మయి శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి సత్యవేడు వరదయ్యపాలెం తహసీల్దార్లు,ఆర్ఐ లు విఆర్ఓ లు కలెక్టరేట్ భూసేకరణ సిబ్బంది తదితరులు పాల్గొంటున్నారు

కదిలించే వార్త తెలుగు దినపత్రిక
శుక్రవారం- 12 -డిసెంబర్ - 2025

# జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు

**జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాలతో వాహనాల రద్దీ అధికంగా ఉన్న కూడళ్లలో సంచరించి వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్న ట్రాఫిక్ సి.ఐ**



అనంతపురం, క్రైమ్,**కదిలించే వార్త/ డిసెంబర్ 11 :** అనంతపురం నగరంలో వాహన రద్దీ నియంత్రణ, రోడ్డు భద్రతా ప్రమాణాల పెంపు, మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణను మరింత బలోపేతం చేయడానికి, ట్రాఫిక్ సి.ఐ వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు విభాగం విస్తృత స్థాయి చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రంలోని ముఖ్యమైన రహదారులు, వాణిజ్య కేంద్రాలు, విద్యాసంస్థల పరిసరాలు మరియు రద్దీ ప్రాంతాల్లో వాహనాల సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సి.ఐ శ్రీ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ.., ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత మద్యం సేవించి వాహనం నడపడం చేయరాదు వేగ పరిమితులను ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, సురక్షిత రహదారి ప్రయాణం కోసం ప్రతిఒక్కరూ క్రమశిక్షణ పాటించాలని ఆయన కోరారు.

# శింగనమల మండలం లోని పెద్ద జలాలపురం గ్రామం లో మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన

**జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాల మేరకు శక్తి యాప్ – పనితీరు, ఉపయోగాలు, తదితర అంశాలపై అవగాహన చేసిన ఆయా శక్తి టీంలు, ఎస్సై సిబ్బంది.**





శింగనమల మండలం, క్రైమ్, **కదిలించే వార్త డిసెంబర్ 11:** శింగనమల మండలం% పెద్ద జలాలపురం గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించి సమాజంలో మహిళల భద్రత, మహిళల రక్షణ కు బి.ఎన్.ఎస్ లో ఉన్న చట్టాలను, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్వినియోగం, మరియు ఆన్‌లైన్ భద్రత విషయాలపై వారికి విస్తృతమైన అవగాహన కల్పించారు. మొబైల్, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే ప్రమాదాలను గుర్తించటం, అనుమానాస్పద లింకులు లేదా అనుచిత సందేశాలు వచ్చినప్పుడు వెంటనే పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తు చేశారు: డయల్ 100/112 (అత్యవసర సహాయం) చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ) గృహ హింస 181 మహిళ వేధింపులు 1091 సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930 సైబర్ మిత్ర

# ఆయా ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ నివేదికలను త్వరితగతిన పంపించాలి

**- : జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ**



అనంతపురం, కలెక్టరేట్, **కదిలించే వార్త డిసెంబర్ 11:** జిల్లాలో ఆయా ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ నివేదికలను త్వరితగతిన పంపించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ, పిజిఆర్ఎస్, రీసర్వే, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, భూబదలాయింపు, తదితర అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కు సంబంధించి రీఓపెన్ చేసిన అర్జీలపై తగిన చర్యలు తీసుకుని సకాలంలో పరిష్కరించాలన్నారు. రీసర్వేకి సంబంధించి ఫేజ్ 1, 2,3 గ్రామాల్లో అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులు, రైల్వే, నెడ్ క్యాప్ పరిధిలో ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ నివేదికలను వారం రోజుల్లోపు పంపించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఆయా శాఖల పరిధిలో ప్రధాన ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి వాటికి భూ సేకరణ, భూబదలాయింపులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి మరియు ఇంచార్జి డిఆర్ఓ రామకృష్ణారెడ్డి, సర్వే ఏడి రూప్ల నాయక్, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, కలెక్టరేట్ సెక్షన్ ల సూపరింటెండెంట్ రియాజుద్దీన్, నెడ్ క్యాప్, ఎన్హెచ్, ఆయా శాఖల అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీ మెరిట్ లిస్ట్ విడుదల.

అనంతపురం, కలెక్టరేట్, **కదిలించే వార్త డిసెంబర్ 11:** వైద్య ఆరోగ్యశాఖ లో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా ఏప్రిల్ మాసంలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదల కు సంబంధించి వివిధ రకాల ఉద్యోగాలు భర్తీ కోసం అప్లై చేసిన వారి సెలక్షన్ మెరిట్ లిస్ట్ విడుదల చేయడం జరిగింది. ఇందులో ప్రధానంగా సైకాలజిస్ట్, ఆడియోలజిస్ట్,ఆప్తల్మలజిస్ట్, ఫార్మసిస్ట్ అలాగే డేటా ఎంట్రీ ఆపరేటర్, పోస్టులకు సంబంధించి ప్రభుత్వ అధికారిక వెబ్సైటు నందు ఉంచడం జరిగిందని కావున పై ఉద్యోగాలకు అప్లై చేసిన అభ్యర్థులు వారి యొక్క పేర్లను మెరిట్ లిస్టులో చూసుకోవచ్చుని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి ఒక ప్రకటనలో తెలిపారు.

# వివాహ మహోత్సవానికి హాజరైన ఉమామహేశ్వర నాయుడు...



కళ్యాణదుర్గం నియోజకవర్గం,**కదిలించే వార్త డిసెంబర్ 11:** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండల కేంద్రానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుందుర్పి మండలం ఎంపీపీ కమలమ్మ నాగరాజు ఆహ్వానం మేరకు వారి కుమారుడు దిలీప్ వెడ్స్ జోష్న ల వివాహ వేడుకకు ఫాదర్ ఫెర్రర్ కళ్యాణ మండపంలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కళ్యాణదుర్గం



నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తలారి సత్యప్ప,ఆపిలేపల్లి సర్పంచ్ అతావుల్లా,కుందుర్పి సర్పంచ్ రామ్మూర్తి, ఏనుమూలదొడ్డి సర్పంచ్ విజయ్, మాజీ జడ్పీటీసీ రాజగోపాల్, తాలూకా ఐటీ వింగ్ అధ్యక్షుడు మరి స్వామి, స్టేట్ సెల్ జాయింట్ సెక్రటరీ రాము, కరిగాన పల్లి మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, సోషల్ మీడియా మండల కన్వీనర్ రాజు, పర్వతనేని మధు,ఆదిమూలం మంజు,రవిచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లాలో మతసామరస్య పరిమళం: రాయచోటిలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం ప్రశాంతం.

**జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ని ఘనంగా సన్మానించిన మత పెద్దలు..**









రాయచోటి, క్రైమ్, **కదిలించే వార్త డిసెంబర్ 11:** గత ఏడాదిలో చోటుచేసుకున్న అనుకోని పరిస్థితుల నేపథ్యంలో, రాయచోటిలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహణపై కొందరిలో నెలకొన్న ఆందోళనలను పటాపంచలు చేస్తూ, ఈ ఏడాది ఉత్సవం శాంతియుతంగా, ఎటువంటి ఆందోళనలు లేకుండా విజయవంతంగా పూర్తయింది. ఈ అద్భుతమైన మతసామరస్య వాతావరణానికి కృషి చేసిన జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో మతపెద్దలు, పీస్ కమిటీ సభ్యులు, భక్తులు ఘనంగా సన్మానించారు.

## గ్రామోత్సవం విజయవంతం

గతంలో నెలకొన్న అపోహలు, ఆందోళనలను పటాపంచలు చేస్తూ రాయచోటిలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగింది.

## ఎస్పీ కి సన్మానం?

ఈ సామరస్య వాతావరణానికి కృషి చేసిన జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ని ముస్లిం సోదరులు, అయ్యప్ప స్వామి భక్తులు, మతపెద్దలు, పీస్ కమిటీ సభ్యులు కలిసి శాలువ, పూలమాలలు, బొకేలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా, ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ కూడా శాంతియుత వాతావరణానికి సంపూర్ణ సహకారం అందించిన హిందూ-ముస్లిం మతపెద్దలను, పీస్ కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ పరస్పర గౌరవం, సత్కారం జిల్లా పోలీసు శాఖ, ప్రజల మధ్య ఉన్న పటిష్టమైన బంధాన్ని చాటి చెప్పింది.

## భవిష్యత్తుపై భరోసా:

ఇకపై హిందూ-ముస్లిం పండుగలు ఏవైనా సరే సామరస్యంగా, శాంతియుతంగా జరుపుకోవడానికి సంపూర్ణ సహకారం అందిస్తామని అందరూ ప్రకటించారు. పోలీస్ శాఖకు ధన్యవాదాలు: కార్యక్రమాన్ని విజయవంతం చేసి, ప్రజల్లోని ఆందోళనలను తొలగించినందుకు పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ మాట్లాడుతూ.. రాయచోటి ప్రజల సహకారం అభినందనీయం. పోలీసు శాఖ కేవలం శాంతిభద్రతలను కాపాడటమే కాదు, ప్రజల మధ్య ఐకమత్యాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి కూడా కృషి చేస్తుంది. ఈ రోజు మన ఐకమత్యమే, గత ఏడాది నాటి దురదృష్టకర సంఘటన కేవలం కొందరి ఆకతాయిల చర్యే అని నిరూపించింది. భారతదేశం యొక్క గొప్ప సంస్కృతి 'భిన్నత్వంలో ఏకత్వం'. మనం అందరం ఒకే తల్లి బిడ్డలం. ఈ స్ఫూర్తిని కొనసాగించండి. పోలీసు శాఖకు మీ సహకారం ఇలాగే ఉండాలి."

## ముస్లిం సోదరులు / మతపెద్దలు:

మేము, అయ్యప్ప భక్తులము, హిందూ సోదరులము 'భాయి భాయి' లా ఉంటాము. గతంలో కొందరి ఆకతాయిల వల్ల సమస్యలు వచ్చాయి, కానీ ఇకపై అలాంటి వాటికి తావు లేదు. మా పండుగలైనా, మీ పండుగలైనా అందరం కలిసి శాంతియుతంగా జరుపుకుంటాము." సమస్యలు రాకుండా ముందే శాంతి చర్చలు జరిపి, ఇంత ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పిన ఎస్పీ కి, పోలీసు శాఖకు మా ప్రత్యేక ధన్యవాదాలు.

## అయ్యప్పస్వామి భక్తులు / హిందూ మతపెద్దలు:

గ్రామోత్సవం ప్రశాంతంగా జరగడంతో మా ఆందోళనలు పూర్తిగా తొలగిపోయాయి. ముస్లిం సోదరులు మాకు అందించిన సహకారం, మద్దతు మరువలేనిది. మతం వేరైనా, మనమంతా మనుషులం, ఇరుగుపొరుగున ఉండే కుటుంబ సభ్యులం." ఎస్పీ ముందుండి పరిస్థితిని చక్కదిద్దిన తీరు ప్రశంసనీయం. ఇకపై అన్ని పండుగలకు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందిస్తాము."

## పీస్ కమిటీ సభ్యులు:

శాంతి కమిటీలు, మతపెద్దలు, పోలీసులు కలిసి పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైంది. ప్రజలందరిలోనూ సామరస్యం పెంపొందించడం మా ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిస్తామని హామీ ఇస్తున్నాము." ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ బి.వి.చలపతి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ పి.రాజా రమేష్, రాయచోటి ఎస్ఐ ఎస్.జహీర్ సహా పలువురు పోలీసు సిబ్బంది మరియు మతపెద్దలు పాల్గొన్నారు.

# అనంతపురం నందు రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 10,11 రెండు రోజుల పాటు జరుగుతున్న సందర్భంగా రెండవ రోజు సమావేశానికి అతిధి గా హాజరు కావాలని ఆహ్వానించడం వలన వారి సభకు హాజరైన జాతీయ కార్యవర్గ సభ్యులు వేమన తన సందేశానీ ఇవ్వడం జరిగింది.




అనంతపురం,**కదిలించే వార్త డిసెంబర్ 11:** ఈ సందర్భంగా వేమన మాట్లాడుతూ ఈరోజు ఆంధ్రప్రదేశ్ 3వ రాష్ట్ర మహాసభల్లో పాల్గొనే అవకాశం రావడం నాకు గౌరవంగా ఉంది. విద్యార్థి ఉద్యమం దేశ భవిష్యత్తు కోసం పోరాడే అత్యంత శక్తివంతమైన బలం. ఈ సందర్భంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై కొన్ని ముఖ్యమైన విషయాలను మీ ముందుకు తీసుకువస్తాను. దేశ వ్యాప్తంగా ఉన్న పబ్లిక్ విద్యా వ్యవస్థను విధ్వంసం చేస్తూ, ప్రభుత్వాలు విద్యను పూర్తిగా ప్రైవేట్ రంగానికి అప్పగిస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు అన్నీ కార్పొరేట్‌ల లాభాల కోసం దోపిడీ కేంద్రాలుగా మారుతున్నాయి. ఈరోజు కేంద్ర ప్రభుత్వం వంటి విధానాలతో విద్యాలో స్వయంప్రతిపత్తి తొలగింపు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వంటి సంస్కరణలు విశ్వవిద్యాలయాల ప్రజాస్వామిక నిర్మాణాన్ని పూర్తిగా విచ్ఛిన్నం చేస్తున్నాయి. అందులో భాగంగానే యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి హరించబడుతోంది, అకడమిక్ స్వేచ్ఛపై దాడి జరుగుతోంది, కేంద్రానికి పూర్తిస్థాయి నియంత్రణ ఇచ్చే ప్రయత్నం జరుగుతుంది. దేశంలోని అనేక విశ్వవిద్యాలయాలకి ఎవరైతే ఆర్ఎస్ఎస్ తో అనుబంధంగా ఉన్నారు వారని వైస్ ఛాన్సలర్గా, రిజిస్ట్రార్ లాగా నియమిస్తూ విద్యను ఫాసిస్ట్ విధానాలతో పూర్తిగా నిర్వీర్యం చేయడమే ఏకైక లక్ష్యం పెట్టుకుని ముందుకు పోతున్న ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు విద్యార్థి ఉద్యమాలతో అడ్డుకట్ట వేయాలి. కాబట్టి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఇలాంటి చర్యలపై ఎప్పటికీ ఎప్పుడూ విద్యార్థులను మేల్కొలిపి విద్యార్థి ఉద్యమాలు నిర్మించాలని పిలుపునివ్వడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం అదేవిధంగా గతంలో ఉన్న ప్రభుత్వాలు పూర్తిగా కేంద్రానికి తలవంచి నిర్బంధంగా రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసి ఈరోజు ఉన్నత విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి మాటలకు మాత్రం పాఠశాల విద్య మాత్రమే ఎన్నికల కోసం ఉపయోగించుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ ఒకరేమో అమ్మ ఒడి అన్నారు మరొకరు విద్యా కానుక అంటూ ఓట్లు కొల్లగొట్టుకుంటూ ఉన్నత విద్యను పూర్తిగా ప్రవేట్ కార్పొరేట్ చేతుల్లో పెట్టే పనిలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని ఎప్పటికీ ఎప్పుడు విద్యార్థి ఉద్యమాలతో అడ్డుకట్ట వేయాలని పిలుపునివ్వడం జరిగింది ముఖ్యంగా అధికారంలోకి రాకముందు కూటమి నాయకులు అనేక తప్పుడు హామీలు ఇచ్చి ఈరోజు కనీసం వాటిపై చర్చను కూడా లేకుండా చేయడాన్ని పూర్తిగా ఖండించాలి ముఖ్యంగా వాటిలో జీవో నెంబర్ 77 ఉమ్మడి ప్రవేశ పరీక్షలను రద్దు చేస్తామని హామీలు ఇచ్చినప్పటికీ అధికారం ఇచ్చినటువంటి వాటిని గాలికి వదిలేసి ఉన్నత విద్యను పూర్తిగా నిర్వీర్యం చేయడం జరుగుతుంది కాబట్టి వామపక్ష విద్యార్థి సంఘాలు ఏకమై ఏవైతే పూర్తిగా మూతపడడానికి దగ్గరలో ఉన్నాయో ఉదాహరణకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీలను కాపాడుకోవడానికి వామపక్ష విద్యార్థి సంఘాలు ఏకమై విద్యార్థి ఉద్యమాలు నిర్మించి మరి ఈ రాష్ట్ర మహాసభ లో ఉన్నత విద్యను కాపాడుకోవడానికి తీర్మానాలు చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిస్తూ ముగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు భీమేష్ పాల్గొనడం జరిగింది.

# జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు పక్కా నివేదికలు రూపొందించాలి

**ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కృషి చేయాలి**

**జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్**



పుట్టపర్తి, **కదిలించే వార్త డిసెంబర్ 11:** ఈ నెల 17, 18న రెండు రోజుల పాటు అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు అన్ని శాఖలు పక్కా నివేదికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు ఏపీ సచివాలయం లోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి.. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ సంసిద్ధత, ప్రజా సానుకూల అవగాహన, డాక్యుమెంట్స్ అప్లోడ్ ఫర్ ఏజెంట్ స్పేస్ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పుట్టపర్తి కలెక్టరేట్లోని వీసీ హాల్ నుంచి.. జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్ పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్కు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలలో అన్ని శాఖలు పక్కా నివేదికలు రూపొందించాలన్నారు. ఆయా శాఖల లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ప్రత్యేకంగా శాఖలలో అమలవుతున్న ఉత్తమ ప్రాక్టీసెస్ పై 13 లోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో పేదరిక నిర్మూలన, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నీటి సంరక్షణ, వ్యవసాయం, రవాణా, ఇంధనం, స్వచ్ఛభారత్ వంటి అంశాలపై దృష్టి సారించి, 10 సూత్రాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారని... వాటి సాధన దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి కార్యక్రమాలపై ప్రజా సానుకూల అవగాహనను పెంచాలి. చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల అమలు, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సేవలపై ప్రజలలో తగిన అవగాహన కల్పించి సానుకూల దృక్పథం పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేయుచున్న తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఎస్పీ పరిశీలన



తిరుపతి **కదిలించే వార్త డిసెంబర్ 11:** తిరుపతి శ్రీ సాంస్కృత విద్యాపీఠం ప్రాంగణంలో జరిగే కార్యక్రమాన్ని పురస్కరించుకొనిభద్రతా ఏర్పాట్లను తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ సి.ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్. సమీక్షించారుఈ రోజు సాయంత్రం పోలీసు శాఖ అధికారులు సాంస్కృత విద్యాపీఠం ప్రతినిధులతో కలిసి సమావేశమై కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న భద్రతా మార్గదర్శకాలు సిబ్బంది నియామకం వంటి కీలక అంశాలను క్షేత్రస్థాయిలో వివరంగా పరిశీలించారుఈ సందర్భంగా ఎస్పీ గారు వీఐపీ ఎంట్రీ ఎగ్జిట్ మార్గాలు వేదిక పరిసరాలు పార్కింగ్ ఏరియా పాయింట్లను పర్యవేక్షించి అక్కడ తీసుకోవలసిన భద్రతా చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమర్థమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ చేయాలనిఅవసరమైన చోట అదనపు బారికేడింగ్ సిబ్బంది మొబిలైజేషన్ మార్గదర్శక సూచికల ఏర్పాటు వంటి చర్యలను వేగంగా పూర్తి చేయాలని ఎస్పీ గారు సంబంధిత అధికారులకు సూచించారు ముఖ్యమంత్రివర్యుల పర్యటనకు సంబంధించిన అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎటువంటి లోటుపాట్లు లేకుండా భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా జరపాలని ఎస్పీ గారు సూచించారుఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లు శ్రీ రవిమనోహర చారి (శాంతి భద్రతలు) శ్రీ శ్రీనివాసుల రావు (ఏ ఆర్) డి.ఎస్.పి లు భక్తవత్సలం ఈస్ట్, ప్రసాద్ చంద్రగిరి చంద్రశేఖర్ ఏఆర్ సి.ఐ లు మద్దయ్య ఆచారి ఎస్.బి, సంజయ కుమార్ ట్రాఫిక్ మరియు ఇతర విభాగ అధికారులు పాల్గొన్నారు

# అటల్ ఆలోచన.. మోదీ ఆచరణ





అనంతపురం**కదిలించే వార్త డిసెంబర్ 11:** ధర్మవరం పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్ లో బహిరంగ సభ చారిత్రాత్మకం. పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఆరోగ్య కుటుంబ సంక్షేమ వైద్య విద్య శాఖల మంత్రి సత్య కుమార్ యాదవ్ గారికి అభినందనీయులు. 2087 మంది విద్యార్థులకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా సైకిళ్లు పంపిణీ చేయడం శుభపరిణామం. వాజ్పేయి ఆశీస్సులు.. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకం. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆచరణ మార్గంలో అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్న ఆంధ్రప్రదేశ్. అటల్ వాజ్పేయి ఆశయ సాధన కూటమి ప్రభుత్వంతోనే సుసాధ్యం చక్కటి ప్రసంగంతో ఆకట్టుకున్న కూటమి పార్టీల ఎమ్మెల్యేలు మరియు జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, అహుడా చైర్మన్ టీ.సి.వరుణ్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీచిలకం మధుసూదన్ ఈ కార్యక్రమంలో జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీల నాయకులు, మహిళలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సమర్థవంతంగా అడుగులు వేస్తే సంక్షేమం సార్థకం అవుతుంది

**ప్రభుత్వ శాఖలు సమర్థవంతంగా పనిచేయాలి**

**జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్**



పుట్టపర్తి, **కదిలించే వార్త డిసెంబర్ 11:** జిల్లాలో అమలవుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు నిజంగా ఉపయోగపడాలి అంటే అన్ని శాఖలు సమర్థవంతంగా, బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో... వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పట్టు పరిశ్రమ డ్వామా, డిఆర్డిఏ, అటవీ, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి ఆయా శాఖలలో అమలవుతున్న పథకాలు, లక్ష్యాలు, వాటి అమలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి, ఇంకనూ సాధించవలసిన ప్రగతికి తీసుకున్న చర్యలు, చేపట్టాల్సిన కార్యాచరణ తదితరాలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి శాఖ తమ పరిధిలో అమలుచేస్తున్న పథకాల లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలిన లక్ష్యాలను సమయానికి చేరుకునేలా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు నేరుగా చేరే పథకాల విషయంలో ఏ శాఖలోనైనా ఆలస్యం, నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని స్పష్టం చేశారు. శాఖాధికారులు గ్రామస్థాయిలో ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంపై కార్యాచరణ చేపట్టాలని ఆయన ఆదేశించారు. రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా వ్యవసాయ విభాగం మార్గదర్శకాలు అందించాలి. స్వయం ఉపాధి, ప్రకృతి వ్యవసాయం, పట్టు పరిశ్రమలలో ఆధారపడే కుటుంబాలను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి శాఖ నెలవారీగా లక్ష్యాలు, సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నివేదికలు సమర్పించాలని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పోక్స్ షో కేసులో కీలక తీర్పు

తిరుపతి క్రైమ్ **కదిలించే వార్త డిసెంబర్ 11:** తిరుపతి జిల్లాలో మహిళలు చిన్నారులపై జరుగుతున్న నేరాలను అత్యంత తీవ్రతతో పరిగణిస్తూ గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేసిన జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ సూళ్లూరుపేట మండలం పెద్దాపడవ గ్రామంలో వరి పొలంలో బాలికపై లైంగిక దాడి చేసిన రాగల వెంకటరమణయ్య (54)కు గౌరవ నెల్లూరు కోర్టు నేడు జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ 61,500 జరిమానా విధించింది. సుమారు ఆరు నెలల క్రితం జరిగిన ఈ ఘటనలో బాలికను రెండు సార్లు అత్యాచారం చేసి బెదిరించిన విషయం నెలసరి రాకపోవడంతో వైద్య పరీక్షలు చేసినప్పుడు బయటపడిందికేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగంగా పూర్తి చేసి తగిన సాక్ష్యాలను కోర్టులో ఉంచడంతో నేరం రుజువైందిఈ కేసు దర్యాప్తులో అప్పటి . రాజగోపాల్ రెడ్డి ప్రస్తుత చెంచు బాబు . మురళీ కృష్ణ, కోర్ట్ లైసన్ ఆఫీసర్ భాదుష, హెడ్ కానిస్టేబుల్ %ాఖ%. ఖాజా హుస్సేన్ కీలక పాత్ర పోషించగా, ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ వాదించారుమహిళలు చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని జిల్లాలో అనేక కేసుల్లో శిక్షలు పడటం పోలీసుల కఠిన నిబద్ధతకు నిదర్శనమని జిల్లా ఎస్పీ హెచ్చరించారు

## తిరుచానూరులో పద్మావతి ఘాట్ ను పరిశీలించిన తుడా చైర్మన్



తిరుపతి **కదిలించే వార్త డిసెంబర్ 11:**తిరుచానూరులో రూరల్,డిసెంబర్ 11:తిరుచానూరు స్వర్ణముఖి నది తీరాన ఏర్పాటు చేయనున్న పద్మావతి ఘాట్ పరిశీలనకు గురువారం సాయంత్రం తుడా చైర్మన్ టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తి చేసి వెంటనే ముఖ్యమంత్రి ఆదేశాలతో ఘాట్ నిర్మాణం ప్రారంభించి,వాటర్ స్టోరేజ్ ,పిల్టర్ చేసి,గంగా హారతి అన్ని రకాలుగా సౌకర్యాలతో ఘాట్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ పరిశీలనలో తుడా చైర్మన్ తో కలిసి తిరుచానూరు కూటమి నాయకులు పాల్గొని పద్మావతి ఘాట్ నిర్మాణం,స్థానికులకు ,భక్తులకు శుభ పరిణామమని, తుడా చైర్మన్ గా మీరు వేసే ప్రతీ అడుగు అటు పార్టీకి,పదవికి వన్నె తెచ్చిందని అభినందిస్తూ, సన్మానం చేశారు. టీడీపీ ,జనసేన ,బిజెపి నాయకులు తిరుచానూరు టీడీపీ నాయకులు 7 వ వార్డు సభ్యులు రాష్ట్ర వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి,శేషాద్రి, దామినేడు రమేష్,బాలాజీ,డిస్కా శివ,జనసేన నాయకులు తిరుపతి రూరల్ అధ్యక్షులు వెంకట్ రాయల్,ప్రతాప్,సమరసింహా రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు విజయ్ కుమార్, వెంకటేష్, తిరుచానూరు గ్రామ అధ్యక్షులు ఇంద్రారెడ్డి,బిజెపి మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు పుష్పరెడ్డి,ఉపాధ్యక్షులు నాగరాజు రెడ్డి,విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు

## సత్యసాయి జిల్లాలో రహదారి అభివృద్ధికి రూ.107.94 కోట్ల మంజూరు

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు :మంత్రి సవితమ్మ





విజయవాడ, **కదిలించే వార్త డిసెంబర్ 11:** సత్యసాయి జిల్లాలో రహదారుల మరమ్మత్తులు బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. జిల్లాలోని , గ్రామీణ రహదారుల అభివృద్ధి, మరమ్మత్తులు, విస్తరణ పనులకు మొత్తం జిల్లాకు రూ.107.94 కోట్లు మంజూరు చేయడం రాష్ట్ర అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వం కు ఉన్న దృఢ సంకల్పం అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన రోడ్లను, రవాణా సౌకర్యాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిధులతో గ్రామీణ రహదారుల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు పునర్నిర్మాణం, గ్రామీణ లింక్ రోడ్ల మెరుగుదలకు సంబంధించిన పనులు త్వరితగతిన ప్రారంభమవుతాయి" అని తెలిపారు. ఈ నిధుల కేటాయింపుకు ప్రత్యేకంగా కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మాత్యులు శ్రీ పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సవితమ్మ .అభివృద్ధి పనులు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా పారదర్శకతతో చేపడతామని పేర్కొన్నారు.ప్రతి గ్రామం, ప్రతి మండలం అభివృద్ధి చెందే వరకు కృషి చేస్తామని రహదారి సదుపాయాల మెరుగుదల ద్వారా జిల్లా నియోజకవర్గ ఆర్థిక, సామాజిక పురోగతికి మరింత ఊతం లభిస్తుంది" అని మంత్రి సవితమ్మ తెలిపారు.

## చలికాలంలో ఇమ్యూనిటీ పెంచుకోవాలా? ఇవి తప్పక ట్రై చేయండి!

వాతావరణంలో మార్పులు మానవ శరీరాన్ని ప్రభావితం చేస్తాయి. దీంతో ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉన్నట్లైతే సీజనల్ వ్యాధులు కూడా వేధిస్తాయి. ముఖ్యంగా చలికాలంలో ఇమ్యూనిటీ తగ్గుతుంది. దీంతో చలి, పొడి గాలి, వైరస్‌లు వేగంగా వ్యాపిస్తాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే సులభమైన మార్పులతో మీ రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చని చెబుతున్నారు. డాన్స్ చేయడమంటే మీకు ఇష్టమా.. అయితే మీలో ఈ లక్షణాలు ఉన్నట్లే? శీతాకాలంలో ఇమ్యూనిటీ తక్కువగా ఉంటే అతి త్వరగా జలుబు, దగ్గు, జ్వరం, వస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ తరుణంలో ఆరెంజ్, నిమ్మ వంటి విటమిన్ %జ% కలిగిన ఫ్రూట్స్(మామిడి, జామ, కివి), ఒమెగా-3 కలిగిన చేపలు, స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీస్, బ్రోకోలీ, గ్రీన్ లీవ్స్, పాలకూర, పెరుగు, బాదం , సన్‌ఫ్లవర్ గింజలు, అల్లం, వెల్లుల్లి, గుడ్లు, పప్పులు, బీన్స్, పసుపు వంటివి ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. ఇవి శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతుందని వైద్య నిపుణులు సూచించారు. అల్లం, వెల్లుల్లి, పసుపు శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గించి ఇమ్యూనిటీ పెంచుతాయి. చలికాలంలో చల్లని వాటర్‌ను పూర్తిగా అవైడ్ చేయండి. గోరువెచ్చని నీరు ఎక్కువగా తాగండి. చలిలో నీరు తాగడం తగ్గిపోతుంది. గోరువెచ్చని నీరు జీర్ణక్రియకు, డిటాక్స్‌కు ఉపయోగకరం. చాలా మందికి 'టీ' తాగడం అలవాటు ఉంటుంది. ఈ తరుణంలో నార్మల్ 'టీ' కి బదులుగా అల్లం టీ, గ్రీన్ టీ వంటివి తీసుకోండి. రోజూ రాత్రి నిద్రకు ముందు పసుపు పాలు తీసుకోవడం వల్ల శరీరాన్ని వేడిగా ఉంచి ఇన్ఫెక్షన్లను దూరం చేస్తాయి. అలాగే, రోజుకు 7-8 గంటలు నిద్ర పోవాలి. నిద్ర ఇమ్యూన్ సిస్టమ్‌ని రీసెట్ చేస్తుంది. చలిలో బయటకు వెళ్లడానికి ఇష్టం ఉండదు. దీంతో రోజూ వ్యాయామం చేసేవాళ్లు కూడా అలాగే పడుకుంటారు. కనుక తేలికపాటి వ్యాయామం, యోగా చేయడం ఉత్తమమని ఆరోగ్య నిపుణులు సూచించారు. చలి కాలంలో వీచే ఈదురుగాలులు శరీరంలోని ఉష్ణోగ్రతను పూర్తిగా తగ్గిస్తోంది. ఇది ఇన్ఫెక్షన్స్‌కు అవకాశం ఇస్తుంది. కాబట్టి స్వెటర్, మఫ్లర్ వంటివి ధరించాలి. చాలా మందికి చలికాలంలో ఫ్లూ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వైద్యుడి సలహా మేరకు వ్యాక్సినేషన్ తీసుకోవడం మంచిది. ఈ లక్షణాలు ఉన్నాయా? అయితే మీకు వయసు అయిపోతున్నట్టే! నోట్: పైన తెలిపిన సమాచారం ఇంటర్నెట్ నుంచి స్వీకరించబడింది. మీ అవగాహన కోసం మాత్రమే అందిస్తున్నాం. ఏమైనా సందేహాలు ఉంటే వైద్య నిపుణులను సంప్రదించగలరు. 'దిశ' దీనిని ధృవీకరించలేదు.

## మెలటోనిన్ సప్లిమెంట్ల వాడకం.. గుండె వైఫల్యానికి దారితీయొచ్చు!

టెన్షన్స్ పెరిగిపోతున్నాయనో, నిద్ర పట్టడం లేదనో కొందరు మెలటోనిన్ సిప్లిమెంట్లు వాడు తుంటారు. దీనివల్ల ప్రశాంతంగా నిద్రపోవచ్చునని, మైండ్ రిలాక్స్ అవుతుందని భావిస్తారు. కానీ ఇది చాలా హానికరం అంటున్నారు వైద్య నిపుణులు. మెదడులో మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపించి నిద్ర రావడానికి కారణం అయ్యే ఈ క్యాప్సూల్స్ వాడితే గుండె వైఫల్యం చెందే అవకాశముందని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ 2025 సైటిఫిక్ సెషన్స్‌లో ప్రదర్శించిన ఒక అధ్యయనం వెల్లడించింది. ఆ వివరాలేమిటో చూద్దాం. సింగిల్స్‌కంటే మింగిల్సే ఎక్కువ..! చీటింగ్‌లకు వేదికవుతున్న డేటింగ్ యాప్స్! సైంటిఫిక్ అధ్యయనాల ప్రకారం.. మెలటోనిన్ సప్లిమెంట్లను ఏడాదికిపైగా వాడుతున్న వారిలోనే హార్ట్ ఫెయిల్యూర్స్ సంభవించే అవకాశాలు 90 % వరకు పెరుగుతున్నాయి. స్టడీలో భాగంగా యావరేజ్ ఏజ్ 56 ఏండ్లున్న 1,31,000 మంది నిద్రలేమి రోగుల హెల్త్ డేటాను నిపుణులు పరిశీలించారు. వీరిలో సుమారు 65,000 మంది కనీసం ఒక సంవత్సరం పాటు మెలటోనిన్ మాత్రలు వాడారు. అయితే వీటిని వాడని వారితో పోల్చితే, దీర్ఘకాలం వాడిన వారిలో 5 సంవత్సరాల్లో గుండె వైఫల్యం వచ్చే ప్రమాదం 90 శాతం ఎక్కువగా ఉందని, కనీసం 90 రోజుల వ్యవధితో రెండు సార్లు ప్రిస్క్రిప్షన్ తీసుకున్న వారిలో రిస్క్ 82 శాతం ఎక్కువగా కనిపించిందని పరిశోధకులు వెల్లడించారు. అంతేకాకుండా మెలటోనిన్ సప్లిమెంట్లు వాడుతున్న వ్యక్తులు గుండె వైఫల్యం కారణంగా ఆస్పత్రిలో చేరే అవకాశం 3.5 రెట్లు అధికంగా ఉంటున్నదని అధ్యయనాలు సూచిస్తున్నాయి. వైద్య నిపుణులను సంప్రదించకుండా, వారి సలహాలు లేకుండా మెలటోనిన్ మాత్రలు వాడకూడదని పేర్కొంటున్నాయి. లిగమనిక పైవార్తలోని సమాచారం ఇంటర్నెట్ ఆధారంగా సేకరించబడింది. అనుమానాలు ఉంటే నిపుణులను సంప్రదించగలరు.

## మొబైల్ ఫోన్‌ను చెవికి ఆనించి మాట్లాడుతున్నారా? బ్రెయిన్ ట్యూమర్ రావచ్చు..!





ప్రస్తుతం ప్రతీ ఒక్కరు మొబైల్‌ఫోన్ వాడుతున్నారు. కొందరైతే గంటల తరబడి మాట్లాడుతుంటారు. అయితే ఇలా చేయడం మీ ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. రోజుకు 15 నిమిషాలు చెవికి దగ్గరగా పెట్టుకొని ఫోన్ మాట్లాడేవారిలో పదేండ్ల తర్వాత బ్రెయిన్ ట్యూమర్స్ పెరిగే అవకాశం ఉందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఆంకాలజీ లో పబ్లిషైన ఒక అధ్యయనం పేర్కొన్నది. అలాగే క్యాన్సర్ వచ్చే అవకాశం కూడా పెరుగుతుందని పరిశోధకులు కనుగొన్నారు. అయితే ఇయర్‌ఫోన్ లేదా హెడ్‌ఫోన్ వాడితే ఈ రిస్క్ అంత ఉండకపోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. సింగిల్స్‌కంటే మింగిల్సే ఎక్కువ..! చీటింగ్‌లకు వేదికవుతున్న డేటింగ్ యాప్స్! చెవికి దగ్గరగా, తల భాగంలో ఫోన్‌ను ఎక్కువసేపు ఉంచి మాట్లాడటం వల్ల దాని నుంచి వెలువడేరేడియో ఫ్రీక్వెన్సీ రేడియేషన్ మెదడు కణాలపై ప్రభావం చూపి, దీర్ఘకాలంలో బ్రెయిన్ ట్యూమర్ డెవలప్ అయ్యేందుకు దారితీస్తుంది. ముఖ్యంగా గ్లియోమా (%స్త్రశ్రీఱశీఝ%), అలాగే అకౌస్టిక్ న్యూరోమా అనే రెండు రకాల మెదడు కణితులు దీర్ఘకాలిక ఫోన్ వాడకంతో సంబంధం కలిగి ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. ఈ పరిశోధనలో నిపుణులు పరిశీలించినప్పుడు రోజుకు 15 నిమిషాలకు పైగా ఫోన్‌ను తలకు ఆనించి మాట్లాడినవారిలో, అలా మాట్లాడని వారితో పోలిస్తే గ్లియోమో, అకౌస్టిక్ న్యూరోమా కణాలు చాలా ఎక్కువగా కనిపించాయి. మొబైల్ ఫోన్‌ల నుంచి వెలువడే రేడియో ఫ్రీక్వెన్సీ రేడియేషన్ ఇందుకు కారణమని రీసెర్చర్స్ అంటున్నారు. కాబట్టి హెడ్‌ఫోన్స్, స్పీకర్ ఫోన్ లేదా ఇయర్‌ఫోన్స్ వాడటం, ఫోన్‌ను తలకు అడ్డం పెట్టకుండా, చెవి దగ్గరగా పెట్టుకొని గంటల తరబడి మాట్లాడటం మంచిది కాదంటున్నారు నిపుణులు. రెండు మూడు నిమిషాలకంటే ఎక్కువసేపు మాట్లాడకపోవడం మంచిదని, ఒకవేళ ఎక్కువసేపు మాట్లాడాల్సి ఉంటే 5 నిమిషాలకోసారి కట్ చేసి కాసేపు గ్యాప్ ఇచ్చి మాట్లాడాలని సూచిస్తున్నారు. డాన్స్ చేయడమంటే మీకు ఇష్టమా.. అయితే మీలో ఈ లక్షణాలు ఉన్నట్లే? వివిధ అధ్యయనాలు ఏం చెబుతున్నాయి? ప్రపంచవ్యాప్తంగా 13 దేశాల్లో జరిగిన అతిపెద్ద అధ్యయనం ఇది. రోజుకి 30 నిమిషాలు, 10 సంవత్సరాలకు పైగా ఫోన్ చెవికి అడ్డం పెట్టి మాట్లాడిన వారిలో గ్లియోమా రిస్క్ 40% పెరిగింది. చిన్న పిల్లలకు ప్రీ స్కూల్ అవసరమా? తల్లిదండ్రులు తప్పక ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే! గ్రూప్ అధ్యయనాలు (స్వీడన్, 1997-2019) : బలమైన రేడియేషన్ ఉన్న పాత 2%+/3+% ఫోన్లు వాడిన వారిలో గ్లియోమా రిస్క్ 3 రెట్లు, అకౌస్టిక్ న్యూరోమా రిస్క్ 3 నుంచి 5 రెట్లు పెరిగింది. ఎక్కువగా ఫోన్ వాడే వారిలో గ్లియోమా, మెనింజియోమా రిస్క్ 2 నుంచి 3 రెట్లు ఎక్కువగా కనిపించింది. చలికాలంలో ఇమ్యూనిటీ పెంచుకోవాలా? ఇవి తప్పక ట్రై చేయండి! (బ్రిటన్, 2019) ఎలాంటి రిస్క్ పెరగలేదని చెప్పింది (కానీ ఈ అధ్యయనంలో సగటు ఫోన్ వాడకం చాలా తక్కువ %-% రోజుకి కొన్ని నిమిషాలు మాత్రమే). లిడెన్మార్క్ కోహార్ట్ స్టడీ (2020) %-% రిస్క్ పెరగలేదని చెప్పింది (కానీ డేటా మొబైల్ కంపెనీల నుంచి తీసుకున్నారు. ఎవరు ఎంతసేపు చెవికి అడ్డం పెట్టి మాట్లాడారో కచ్చితంగా తెలియదు). (ఇటలీ, 2018) %-% చాలా తక్కువ మోతాదు రేడియేషన్‌తోనే ఎలుకల్లో హృదయ ష్వాన్నోమా కనిపించింది. (2025 వరకు ప్రిలిమినరీ ఫలితాలు) : 2.5 లక్షల మందిపై 10ం సంవత్సరాలు జరుగుతున్న అతిపెద్ద ఆధునిక అధ్యయనం. ఇప్పటివరకు గ్లియోమా రిస్క్‌లో స్పష్టమైన పెరుగుదల కనిపించలేదు. కానీ అకౌస్టిక్ న్యూరోమా కేసులు కొంచెం ఎక్కువగా ఉన్నాయి. అంటే ఇక్కడ కొన్ని అధ్యయనాలు రిస్క్ కచ్చితంగా పెరుగుతుందని చెప్పగా, మరికొన్ని "స్పష్టమైన ఆధారం లేదు" అని చెబుతున్నాయి. కానీ ఎక్కువ కాలం, ఎక్కువసేపు చెవికి అడ్డం పెట్టి మాట్లాడే వారిలోనే రిస్క్ ఎక్కువగా కనిపిస్తోంది.

## తరచూ నోటి పుండ్లతో బాధపడుతున్నారా? - ఈ టిప్స్ పాటిస్తే సహజంగానే అదుపులో!

### నోటి అల్సర్లకు విరుగుడు ఇవి - ఏఏ జాగ్రత్తలు పాటించాలో వివరిస్తున్న నిపుణులు!



విటమిన్ లోపం, ఒత్తిడి, నిద్రలేమి, నెలసరి సమయంలో హార్మోన్లలో వచ్చే మార్పులు, వివిధ రకాల వైరల్-బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు ఇవన్నీ చాలా మందిలో నోటి అల్సర్లకు కారణమవుతుంటాయి. కొందరిలో ఒంట్లో వేడి చేయడం వల్ల కూడా ఈ సమస్య తలెత్తుతుంది. ఇలా కారణమేదైనా నోటి అల్సర్ల వల్ల విపరీతమైన నొప్పితో పాటు కనీసం నీరు కూడా తాగడానికి కూడా ఇబ్బంది పడుతుంటాం. అయితే ఈ సమస్యకు మన వంటింట్లోనే పరిష్కారం ఉందని నిపుణులు చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! తులసి ఆకులు : తులసి మొక్కతో ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలున్నాయి. వివిధ రకాల అలర్జీలను తగ్గించడంలో ఈ ఆకులు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇందులో నోటి అల్సర్లను తగ్గించే లక్షణం కూడా ఉందంటున్నారు నిపుణులు. రోజుకు నాలుగైదు సార్లు కొన్ని తులసి ఆకులను నమలడం వల్ల సులభంగా ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చని చెబుతున్నారు. ఈ ఆకులను నమిలేటప్పుడు వాటికి కొన్ని నీళ్లు కూడా జతచేస్తే, ఆ ద్రావణం నోరంతా వ్యాపించి, సమస్యను త్వరగా తగ్గిపోతుందని సూచిస్తున్నారు. ఇందులో యాంటీ ఇన్?ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్, యాంటీ-ఆక్సిడెంట్, ఇమ్యునో-మాడ్యులేటరీ లక్షణాల కారణంగా, తులసి వివిధ నోటి రుగ్మతల చికిత్సలో ఆశాజనకమైన మూలికగా ఉంటుందని %×త్వతీఱఫ్ఱశీఝశ్రీ



ప్రచురించింది. ఆహారపదార్థాలకు అదనపు రుచిని తేవడం, చర్మంపై గాయాలను మాన్పడమే కాకుండా నోటి అల్సర్లను తగ్గించడంలోనూ తేనె సమర్థంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అల్సర్ల సమస్య ఎక్కువగా ఉన్నచోట తేనెను రాస్తే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు. ఇందులోని యాంటీమైక్రోబియల్ గుణాల కారణంగా అల్సర్లను కలిగించే బ్యాక్టీరియా త్వరగా నశిస్తుందని పేర్కొంటున్నారు. తేనెలోని సహజగుణాలు నోటి లోపల తేమ ఉండేలా చేసి, అల్సర్ల వల్ల పొడిబారిన చర్మానికి ఉపశమనాన్ని కలిగిస్తాయని తెలియజేస్తున్నారు. తేనెను ఉపయోగించి, అల్సర్ల నుంచి మరింత త్వరిత ఉపశమనం పొందాలంటే, దానికి చిటికెడు పసుపు కలిపితే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఆఫ్తస్? నోటి పూతలతో బాధపడుతున్న పిల్లల సమూహంలో తేనె ప్రభావవంతమైన, సురక్షితమైన చికిత్సా ఏజెంట్‌గా కనుగొనబడిందని ప్రచురించింది. శరీరంలో కనిపించే ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తున్నారా? - ముప్పు తప్పదంటున్న నిపుణులు! ప్రకృతిసిద్ధంగా ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో కొబ్బరిది కీలకస్థానం. నోటి అల్సర్లతో బాధపడేవారు సమస్య ఉన్న చోట కాస్త కొబ్బరి నూనెను రాస్తే ఉపశమనాన్ని పొందచ్చంటున్నారు నిపుణులు. అలాగే ఎండుకొబ్బరి ముక్కలను నమిలినా, అల్సర్ల నుంచి త్వరగా ఉపశమనం పొందచ్చని చెబుతున్నారు. ఇక లేత కొబ్బరిబోండం నీళ్లు ఎక్కువసార్లు తీసుకోవడం వల్ల శరీరంలోని వేడి తగ్గి, అల్సర్ల సమస్య క్రమంగా తగ్గుముఖం పడుతుందని పేర్కొంటున్నారు. గసగసాలు : శరీరంలోని వేడిని తగ్గించడంలో గసగసాలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. నోట్లో అల్సర్లు ఇబ్బంది పెట్టడానికి అధిక వేడే కారణమంటున్నారు నిపుణులు. అందుకే ఈ సమస్యను తగ్గించుకోవడానికి గసగసాలు చక్కటి ప్రత్యామ్నాయం అని సూచిస్తున్నారు. ఒక టేబుల్ స్పూన్ పొడిచేసిన గసగసాలకు, అంతే పరిమాణంలో పంచదారను జతచేసి, సమస్య తగ్గే వరకు రోజూ రెండు లేదా మూడు సార్లు తీసుకుంటే ఫలితం ఉంటుందని తెలియజేస్తున్నారు.నోటి అల్సర్ల నుంచి తక్షణ ఉపశమనానికి సమస్య ఉన్న చోట ఐస్ ముక్కలతో మర్దన చేస్తే మంచి ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అల్సర్?తో ఇబ్బంది పడుతున్నవారు? తరచూ లవంగాలు నమిలితే, ఆ ఘాటుకు సమస్య సులభంగా పరిష్కారమవుతుందంటున్నారు. దీనికి బదులు లవంగం నూనెను కూడా సమస్య ఉన్న చోట అప్లై చేయచ్చని సూచిస్తున్నారు. అలాగే, గోరువెచ్చని నీటితో నోటిని వీల్కైనన్ని ఎక్కువసార్లు పుక్కిలించాలని సలహా ఇస్తున్నారు. ఇలా చేస్తే అల్సర్ల కారణంగా ఎదురయ్యే మంట, నొప్పి నుంచి తక్షణ ఉపశమనం పొందచ్చని పేర్కొంటున్నారు.మజ్జిగను ఎక్కువగా తీసుకుంటే నోటి అల్సర్ల సమస్యను సులభంగా తగ్గించుకోవచ్చని అంటున్నారు. లేకపోతే సమస్య ఉన్నచోట నెయ్యిని రాసినా మంచి ఫలితాన్ని పొందవచ్చని తెలియజేస్తున్నారు.ఏదైనా ఆహారం తీసుకున్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోవాలని, లేదంటే నోట్లో మిగిలిపోయిన ఆహారపదార్థాల నుంచి వెలువడే ఆమ్లాలు నోటి అల్సర్ల సమస్యకు కారణమవుతాయని చెబుతున్నారు.రోజుకు కనీసం రెండుసార్లు పళ్లు తోముకోవడం, రోజుకు ఒకసారి ఫ్లాస్ చేసుకోవాలని %ఎవఏశ్రీఱఅవజూశ్రీబం% అధ్యయనం పేర్కొంది. అలాగే, ప్రతి మూడు నెలలకోసారి టూత్‌బ్రష్‌ను మార్చడం వల్ల నోటి అల్సర్ల సమస్య రాకుండా జాగ్రత్తపడచ్చని నిపుణులు సూచిస్తున్నారు

సాధారణంగా శరీరంలో 'విటమిన్ బి12' శాతం తగ్గిపోతే నోటి అల్సర్లు వస్తాయని, కాబట్టి డాక్టర్ల సలహా మేరకు విటమిన్ బి12 సప్లిమెంట్స్ వేసుకోవడం, ఈ విటమిన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు. 'విటమిన్ సి' పుష్కలంగా లభించే వాటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఇలాంటి అల్సర్లకు చెక్ పెట్టచ్చని అంటున్నారు. నోటి అల్సర్ల సమస్యతో బాధపడుతున్నప్పుడు టీ, కాఫీలకు ఎంత దూరంగా ఉంటే అంత మేలని సలహా ఇస్తున్నారు. శరీరంలో ఎసిడిటీని ఎక్కువ చేసే మాంసాహారానికి కొద్దిరోజులు దూరంగా ఉంటే ఈ సమస్య త్వరగా నయమవుతుందని తెలియజేస్తున్నారు. పచ్చి ఉల్లిపాయలను ఎక్కువగా



తీసుకోవడం వల్ల నోటి అల్సర్ల సమస్య త్వరగా తగ్గుముఖం పడుతుందని చెబుతున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## అఖండ-2 అఖండమైన విజయం సాధిస్తుంది

అఖండ-2 సినిమా రిలీజ్ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం నగరంలో అభిమానులతో కలిసి భారీ బైక్ ర్యాలీ

అఖండ-2 సక్సెస్ మీట్ అనంతపురంలోని నిర్వహించాలని కోరుతామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి











అనంతపురం, **కదిలించే వార్త డిసెంబర్ 11:** సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ నటించిన అఖండ-2 అఖండమైన విజయం సాధిస్తుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అఖండ-2 సినిమా రిలీజ్ సందర్భంగా అనంతపురం నగరంలో టిడిపి నాయకులు, నందమూరి బాలకృష్ణ అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ సాగింది. నగరంలోని ప్రధాన వీధుల మీదుగా జై బాలయ్య అంటూ నినాదాలు చేస్తూ ఆ బైక్ ర్యాలీ సాగింది. గౌరీ థియేటర్ లో శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ నేను మొదటి నుంచి బాలకృష్ణ అభిమానినని.. ఆయన సినిమా ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో ఒక పండుగ వాతావరణం కనిపిస్తుందన్నారు. అఖండ-2 సినిమా ఈనెల 5వ తేదిన రిలీజ్ కావాల్సి ఉందని.. కొన్ని కారణాల వలన వాయిదా పడిందన్నారు. ఇప్పుడు అన్ని అవాంతరాలను దాటుకుని.. శుక్రవారం రిలీజ్ కానుందన్నారు. అఖండ-1కు మించి అఖండ-2 సినిమా విజయవంతమవుతుందన్నారు. ఈ సినిమాలో బాలయ్య విశ్వరూపం చూస్తారన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక డాకూ మహారాజ్ సినిమా మంచి విజయం సాధించిందని.. ఈ సక్సెస్ మీట్ అనంతపురంలో నిర్వహించారన్నారు. ఇప్పుడు అఖండ-2 సినిమా కూడా గ్రాండ్ సక్సెస్ అవుతుందని..ఈ సినిమా సక్సెస్ మీట్ కూడా అనంతపురంలోనే నిర్వహించాలని బాలక్రిష్ణను కోరుతామన్నారు. అఖండ-2 చిత్రం యూనిట్ కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆల్ ది బెస్ట్ తెలిపారు.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt) APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur. ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell: 6303427710